# అందరసొంటి సావు కాదు...

రేణుక (మిడ్కో) విప్లవ, సాహితీ కృషిపై

బంధుమిత్రుల స్పందనలు


















# అందరసొంటి సావు కాదు...

రేణుక (మిడ్కో) విప్లవ, సాహితీ కృషిపై బంధుమిత్రుల స్పందనలు



# అందరసొంటి సావు కాదు...

రేణుక (మిడ్కో) విప్లవ, సాహితీ కృషిపై బంధుమిత్రుల స్పందనలు

ప్రచురణ : కుటుంబ సభ్యులు

ప్రథమ ముద్రణ : ఏప్రిల్ 2025

ప్రతులు : 2000

వెల : 100/-

**ముద్రణ :**

నవ్య ప్రింటర్స్, హైదరాబాద్

**ప్రతులకు**

జి.సోమయ్య, ప్లాట్ నెంబరు : 81

నవదుర్గానగర్ కాలనీ, రాంపల్లి,

హైదరాబాద్ - 501 301

ఫోన్ : 73962 58278

# విషయ సూచిక...


| | | |
|---|---|---|
| • రేణుక జీవిత చరిత్ర | – కుటుంబ సభ్యులు | 5 |
| • కథల గనిలో మెరిసిన మిడ్కో | – పాణి | 10 |
| • వెలుగు పంచిన మిణుగురు | – తాయమ్మ కరుణ | 13 |
| • మిడ్కో కథలు | – వరలక్ష్మి | 17 |
| • మిడ్కో మరణించలేదు... | – నరేష్‌కుమార్ సూఫీ | 21 |
| • రేణుక పర్యాయపదం మిడ్కో | – పాణి | 23 |
| • మిడ్కో (గల్పిక) | – బజరా | 26 |
| • A Revolutionary Flame Extinguished, But the Fire Lives On.. | - Untilted Proletarian Art | 27 |
| • A Rebel's Journey: Gumudavelli Renuka's Life and Death in the Maoist Movement | - Sukanya Shantha | 29 |
| • Gummadivelli Renuka: Maoist, writer, feminist, and rebel | - Ashutosh Sharma | 34 |
| • ఆమె వెలుగు భూగోళమయ్యింది (కవిత) | – వడ్డెబోయిన శ్రీనివాస్ | 38 |
| • మనుషుల మీద ఇంత ప్రేమెలా పుడుతుంది? (స్పందన) | – సిద్ధార్థి సుభాష్ చంద్రబోస్ | 40 |
| • అమరత్వం (కవిత) | – శాఖమూరి రవి | 41 |
| • మిడ్కోకు మరణమే లేదు (కవిత) | – ఏబూసి | 42 |
| • కడవెండి – తరాలపల్లె (కవిత) | – సూర్యచంద్ర | 44 |
| • యవ్వనం–విప్లవం–స్వప్నం (కవిత) | – మట్టి మనిషి | 46 |
| • వెంటాడే నవ్వు (కవిత) | – మెర్సీ మార్గరేట్ | 49 |
| • అణువణువునా రేణుక (స్పందన) | – ఎన్. వేణుగోపాల్ | 50 |
| • ఆమె దాచిన ప్రేమ | – రమాసుందరి | 51 |
| • నివాళి (కవిత) | – ఎంఏ బాసిత్ | 52 |
| • జోహార్లు! (కవిత) | – దేవిశ్రీ | 54 |
| • మరణమే లేని మిడ్కో | – మా.ర.రా. | 56 |
| • రేణుక అలియాస్ మిడ్కో | – ఎస్. ఏ. డేవిడ్ | 58 |
| • ... ఎన్‌కౌంటర్ బూటకం! | – వికల్ప్, పార్టీ అధికార ప్రతినిధి | 62 |



కుటుంబ సభ్యులతో రేణుక



# రేణుకను గుర్తు చేసుకుందాం!

*- కుటుంబ సభ్యులు*

మా ఇంట్లో, మా ఊళ్లో అందరూ ప్రేమగా 'చిట్టమ్మ'గా పిలుచుకునే రేణుక 1970 అక్టోబర్ 14న పుట్టింది. బాపు గుముడవెల్లి సోమయ్య, అమ్మ జయమ్మ (యశోద)ల రెండో సంతానమైన రేణుకకు ఒక అన్న, ఒక తమ్ముడు ఉన్నాం. ఇంట్లో ఒకే ఆడపిల్ల కావడంతో ఆమెను అందరూ ప్రేమగా చూసుకునేవారు. ఊళ్లో వాళ్లు కూడా రేణుకను చాలా ముద్దు చేసేవాళ్లు. అందరు ఆడపిల్లల్లా ఇంటిపనులు, వంటపనులు నేర్చుకోవాలనే ఒత్తిడి ఆమెపై మా ఇంట్లో ఉండేది కాదు. అమ్మాబాపులు ఇచ్చిన స్వేచ్ఛతో ఇంట్లో ఆమెకు పితృస్వామ్య పెత్తనాన్ని పెద్దగా ఎదుర్కోవాల్సి రాలేదని చెప్పొచ్చు.

సన్నగా, పొడుగ్గా ఉండే రేణుక చిన్నప్పటి నుంచే తెలివైన విద్యార్థి. బాపు స్కూలు టీచరు కావడంతో మా కుటుంబం చాలా ఊళ్లు మారాల్సి వచ్చింది. దాంతో ఆమె కోల్కొండ, సీతారాంపురం, కడవెండి, మోత్కూరు, దేవరుప్పుల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూలు చదువు పూర్తి చేసింది. జనగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది.

పద్నాలుగేళ్ల వయసులో పదో తరగతి పరీక్షలు రాయాల్సి ఉండగా రేణుక ఊపిరితిత్తులకు టీబీ సోకింది. రోజూ జ్వరం వస్తూ ఉండేది. కానీ, డాక్టర్లు రోగనిర్ధారణ సరిగా చేయకపోవడంతో ఆమెకు కొన్ని నెలల వరకు సరైన చికిత్స అందలేదు. ఈలోపు జబ్బు బాగా ముదిరి ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింది. చివరకు వరంగల్‌లో డాక్టర్ కోటిలింగం గారు ఆమె వ్యాధిని సరిగా గుర్తించి, సరైన వైద్యం అందించడంతో జబ్బు నయమైంది. కానీ ఊపిరితిత్తుల్లో అప్పటికే కొన్ని టిష్యూలు దెబ్బతినిపోవడంతో దాని ప్రభావం ఆమెను జీవితాంతం వెంటాడింది. వేగంగా నడవలేకపోయేది. పరుగెత్తడం తన వల్ల కాకపోయేది. బాగా ఆయాసం వచ్చేది.

రేణుక ఇంటర్ చదువుతున్న సమయంలో అన్న వెంకట కిషన్ ప్రసాద్ పూర్తికాలం కార్యకర్తగా ఉద్యమంలోకి వెళ్లిపోయాడు. తను ఇంటర్మీడియట్ పూర్తి చేశాక మా కుటుంబం కడవెండి నుంచి మోత్కూరుకు మారింది. కడవెండిలో ఉన్న ఇల్లు అమ్మేసి మోత్కూరులో ఇల్లు కట్టుకున్నాం. అదే సమయంలో రేణుకకు పెళ్లి జరిపించాలనే తొందరపాటు నిర్ణయం మా కుటుంబం తీసుకుంది. రేణుకకు ఉన్నత చదువులు చదవాలని, అప్పుడే పెళ్లి చేసుకోవద్దని బలంగా ఉన్నప్పటికీ బాపు నిర్ణయాన్ని వ్యతిరేకించలేకపోయింది. పెళ్లి చేసుకున్న

తర్వాత కూడా చదువు కొనసాగించవచ్చని బాపు హామీ ఇవ్వడంతో అయిష్టంగానే పెళ్లికి ఒప్పుకుంది. కానీ కొన్ని నెలల్లోనే భర్త వేధింపులు, మానసిక హింసలు, అవమానాలు మొదలయ్యాయి. కొంత కాలంపాటు పుట్టింట్లో ఏమీ చెప్పకుండా వాటిని ఓపికగా భరించింది. కానీ చివరకు పరిస్థితి దారుణంగా తయారవడంతో ఆమె ఈ విషయం ఇంట్లో చెప్పడం, కుటుంబం వెంటనే స్పందించి తనకు అండగా నిలబడటంతో ఆ పెళ్లి పెటాకులు కావడానికి ఎక్కువ సమయం పట్టలేదు. ఇక అప్పటి నుంచి అమ్మాబాపు ఆమెకు అన్ని విధాలా ప్రోత్సాహం అందించడంతో ఆగిపోయిన చదువును మళ్లీ మొదలుపెట్టింది. దాంతో ఆమెలో మళ్లీ స్వేచ్ఛ రెక్కలు విప్పుకుంది.

ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీఏ (ఎక్స్‌టర్నల్) పూర్తి చేసి, ఆ తర్వాత ఎంఏ (తెలుగు), లా కోర్సుల కోసం ఎంట్రెన్సు రాసింది. కోఠి విమెన్స్ కాలేజీలో ఎంఏ (తెలుగు)లో, తిరుపతి పద్మావతి యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీలో సీట్లు వచ్చాయి. అయితే, దూరంలో ఉన్నప్పటికీ తిరుపతిలో లా చేయడాన్నే ఆమె ఎంచుకుంది. అలా ఆమె 1992లో తిరుపతికి పయనమైంది.

తొలి నుంచే చదువరి, సాహిత్యాభిమాని అయిన రేణుక ఈ దశలో సాహిత్యాన్ని విస్తృతంగా చదివింది. ఆనాడు కడవెండి గ్రామంలో, మొత్తంగా ఉత్తర తెలంగాణలో ఉధృతంగా సాగుతున్న విప్లవోద్యమ ప్రభావం ఆమెపై ఎలాగూ ఉంది. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, జీతగాళ్ల వేతనాల పెంపుదల కోసం జరిగిన సమ్మెలు, కడవెండిలో ఒక భూస్వామికి చెందిన పడమటితోటను ఆక్రమించుకొని ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాలు కేటాయించడం కోసం జరిగిన పోరాటం, మహిళలపై వేధింపులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల ప్రభావం రేణుకపై బలంగా పడింది. వాటిన్నింటినీ ఆమె ఒక క్రమంలో అర్థం చేసుకోవడం మొదలుపెట్టింది.

సంక్షిప్త వైవాహిక జీవితంలో తాను ఎదుర్కొన్న వేధింపుల అనుభవంతో పితృస్వామ్యాన్ని, దాని వివిధ రూపాలను, ధోరణులను అవగాహన చేసుకోసాగింది. అది నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫెమినిస్టు సాహిత్యం విస్తృతంగా వెలువడుతున్న కాలం. దాని ప్రభావం కూడా రేణుకపై బాగానే పడింది. అయితే, నూతన ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులు మహిళా సమస్యను ఏ కోణంలో చూస్తారు? దాన్ని ఎంత సీరియస్‌గా తీసుకుంటారు? మహిళల హక్కులను, స్త్రీ పురుష సమానత్వాన్ని కమ్యూనిస్టులు అసలు ఎలా సాధిస్తారు? ఇలాంటి ప్రశ్నలు, అనుమానాలు ఆమెకు ఉండేవి. ఈలోగా తిరుపతి పట్టణ ఆర్గనైజర్ పద్మక్కతో ఆమెకు పరిచయం ఏర్పడింది. అమరుడు పులి అంజన్న ఇచ్చిన రిఫరెన్సుతో 1992లో ఒక రోజు మధ్యాహ్నం పూట పద్మక్క యూనివర్సిటీ హాస్టల్‌కు వెళ్లి రేణుకను కలవడం.... తన జీవితాన్ని చిరస్థాయిగా మార్చేస్తుందని బహుశా రేణుక ఊహించి ఉండకపోవచ్చు. రేణుకలో ఉన్న అనుమానాలను, ప్రశ్నలను పద్మక్క ఒక క్రమపద్ధతిలో నివృత్తి చేసింది. స్థానికంగా జరిగే మహిళా ఉద్యమంలో పాల్గొనేలా ప్రోత్సహించింది. అయితే, 1994లో పద్మక్క బూటకపు ఎన్‌కౌంటర్ వార్త రేణుకకు ఓ పిడుగుపాటు. ఆ దుఃఖం నుంచి తేరుకోవడానికి ఆమెకు చాలా కాలం పట్టింది.

ఆచరణ, అధ్యయనం రెండింటిని మేళవిస్తూ రేణుక క్రమంగా ఒక విప్లవకారిణిగా రూపొందింది. మహిళాశక్తి అనే సంఘంలో పని చేస్తూ, ఆ సంఘం నడిపించే 'మహిళా మార్గం' పత్రికకు క్రమం తప్పకుండా కథలు, రిపోర్టులు రాస్తూ ఉండేది. ఒకవైపు చదువుకుంటూనే సంఘం కార్యకలాపాల్లో క్రియాశీలంగా పాల్గొంటూ.. అదే సమయంలో కథా రచయితగా ఎదిగింది. నిజానికి తిరుపతి వెళ్లడానికి ముందే ఒక కథ రాసి 'నలుపు' పత్రికకు పంపించినప్పటికీ, వాళ్ల ఆఫీసులో దాని చివరి పేజీ మిస్ కావడంతో అది అచ్చుకు నోచుకోలేదు. ఆ తర్వాత,

తిరుపతిలో ఉన్న కాలంలో వరుసగా అనేక కథలు రాసింది. అక్కడి సాహితీమిత్రుల సద్విమర్శలతో, సూచనలతో తన కథారచన విధానాన్ని మెరుగుదిద్దుకుంది.

1996 నాటికే పూర్తికాలం పార్టీ కార్యకర్తగా పని చేసేందుకు సిద్ధపడ్డ రేణుకను పార్టీ నాయకత్వం పట్టణోద్యమంలోనే పని చేయాలని సూచించింది. వరకట్న హత్యలు, ఆడపిల్లలపై లైంగిక వేధింపులు, మురికివాడల్లో ప్రజలు ఎదుర్కొనే దైనందిన సమస్యలు వంటి వాటిపై జరిగిన పోరాటాల్లో ఆమె క్రియాశీలంగా పాల్గొంది. వాటికి నాయకత్వం వహించింది. అదే సమయంలో మహిళామార్గం ఎడిటోరియల్ బోర్డులో భాగమై పత్రికను క్రమం తప్పకుండా ప్రచురించడంలో కీలక బాధ్యత పోషించింది. ఆ తర్వాత వేర్వేరు మహిళా సంఘాలతో కలిసి ఏర్పడ్డ చైతన్య మహిళా సమాఖ్యలో కూడా రేణుక భాగమైంది.

పార్టీ ఉన్నత నాయకత్వాన్ని కలిసేందుకు రేణుక అప్పుడప్పుడు నల్లమల అడవుల్లోకి వెళ్తూ ఉండేది. అమరుడు లింగమూర్తి (కృష్ణన్న) ఆమెకు బాధ్యుడు. ఆనాటికి సంతోష్ కేంద్రకమిటీ సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సెక్రటరీగా ఉన్నాడు. సంతోష్ పేరు కడవెండిలో అందరికీ సుపరిచితమే కానీ రేణుకకు ఆయనతో పెద్దగా పరిచయం లేదు. కృష్ణన్న, అమరుడు ఆర్కే ఇద్దరూ కలిసి సంతోష్, రేణుకల ముందు విడివిడిగా పెళ్లి ప్రతిపాదన ఉంచారు. వారిద్దరు కలుసుకుని మాట్లాడుకునే ఏర్పాటు చేశారు. అలా కొంత కాలం పాటు ఇద్దరి మధ్య కొనసాగిన సంభాషణలు, ప్రేమకు, పెళ్లికి దారితీశాయి. అయితే, సంతోష్ అప్పటికే అగ్రశ్రేణి నాయకుడు కావడం, మరోవైపు రేణుక పట్టణంలో బహిరంగంగా జీవిస్తూ ప్రజాసంఘాల కార్యక్రమాల్లో పని చేస్తూ ఉండటంతో ఈ పెళ్లిని రహస్యంగా ఉంచాలని పార్టీ నిర్ణయించింది. ఉన్నత నాయకత్వానికి, రేణుకకు సన్నిహితులైన కొందరు కామ్రేడ్స్‌కు తప్ప మరెవ్వరికీ ఇది తెలియదు.

కానీ వీరి వైవాహిక జీవితం రెండేళ్లు నిండకుండానే విషాదాంతంగా ముగిసింది. 1999 డిసెంబర్ 2న నల్లా ఆదిరెడ్డి, శీలం నరేష్‌లతో పాటు సంతోష్ అమరుడు కావడం ఆమెకు మరో పిడుగుపాటు. పెళ్లి రహస్యం కాబట్టి బయట ఎవ్వరితోనూ తన దుఃఖాన్ని కూడా పంచుకోలేని దయనీయ స్థితి ఆమెది. అయితే, కొద్ది కాలమే అయినా సంతోష్‌తో తన జీవితం అద్భుతంగా సాగిందని రేణుక చెప్పుకునేది. కథలు, నవలలు, సినిమాల నుంచి విప్లవాచరణ దాకా ఎన్నో అంశాల్లో వాళ్లిద్దరి అభిరుచులు, ఆసక్తులు కలిసేవి. ముఖ్యంగా తన కథలపై సంతోష్ చేసిన విమర్శలు, సూచనలు అన్నింటికన్నా విలువైనవని రేణుక ఆ తర్వాతి కాలంలో చాలా సార్లు ప్రస్తావించింది.

కొంతకాలానికి రేణుక కార్యరంగం విశాఖ నగరానికి మారింది. అక్కడ లాయర్‌గా ప్రాక్టీస్ కొనసాగిస్తూనే ప్రజాసంఘాల్లో క్రియాశీలంగా పని చేసింది. పేద బస్తీల్లో నివసించే మహిళలను కూడగట్టేందుకు కృషి చేసింది. విశాఖ నగర కమిటీ కార్యదర్శిగా ఉన్న అమరుడు కౌముది నాయకత్వంలో పని చేసిన రేణుక తన సాహిత్యకృషిని కూడా యథావిధిగా కొనసాగించింది. కౌముది అప్పటికే పేరుగాంచిన విప్లవ కవి. అందుకే, తమ మధ్య జరిగే సమావేశాల్లో ఉద్యమ సమస్యలపై జరిగే చర్చలతో సమానంగా కవిత్వం, కథల గురించి కూడా చర్చలు కూడా జరిగేవని రేణుక గుర్తు చేసుకునేది.

2003 చివరి నాటికి కౌముది బూటకపు ఎన్‌కౌంటర్‌కు బలికావడంతో రేణుక ఇక బహిరంగ జీవితం

గడపలేని పరిస్థితి తలెత్తింది. పోలీసులు నిరంతరం వెంటాడుతూ, అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తూ ఉండటంతో వారి కన్ను గప్పేందుకు అన్ని విధాలా ప్రయత్నించింది. చివరకు కొందరు విప్లవాభిమానులు ఎంతో సాహసోపేతంగా ఆమెను మహారాష్ట్రకు తరలించి అక్కడి పార్టీ నాయకత్వానికి రేణుకను అప్పగించారు. అక్కడి నుంచి ఒడిషా చేరుకున్న ఆమె బాంసధార డివిజన్‌లో ఉద్యమ బాధ్యతలు చేపట్టింది. త్వరలోనే ఒడియా భాష నేర్చుకొని ఆ భాషలో రాయడం కూడా నేర్చుకునే దిశగా అడుగులు వేసింది.

2005లో శాఖమూరి అప్పారావును ఆమె తన జీవిత భాగస్వామిగా ఎంచుకుంది. ఇద్దరికీ ప్రత్యక్ష పరిచయం లేకున్నా పరోక్షంగా ఒకరి గురించి మరొకరికి బాగా తెలుసు. ఇద్దరూ తమ తమ వైవాహిక జీవితాల్లో సంక్షోభాలను అధిగమించిన వారే. అయితే, ఇద్దరి బాధ్యతలు, కార్యరంగాలు వేర్వేరు కాబట్టి చాలా అరుదుగానే వారిద్దరికి ఒకచోట గడిపే అవకాశం దొరికేది. 2010 మార్చి 12న శాఖమూరి ఎన్‌కౌంటర్ వార్త రేణుక జీవితంలో మరోసారి విషాదాన్ని నింపింది. కలిసి గడిపింది కొద్ది కాలమే అయినా ఆమెపై చెరగని ముద్ర వేసిన ప్రేమమూర్తి శాఖమూరి. అయితే, వ్యక్తిగత జీవితంలో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా విప్లవాచరణలో ఏనాడూ వెనుకడుగెయ్యని రేణుక మరోవైపు సాహితీకృషిని అంతే పట్టుదలతో కొనసాగించింది.

2006లో పార్టీ ఆమెకు 'క్రాంతి' పత్రిక సంపాదక బాధ్యతలు అప్పగించింది. అలా ఆమె కార్యరంగం ఒడిషా నుంచి దండకారణ్యానికి మారింది. ఆనాటి నుంచి ఏప్రిల్ 1, 2025 సాయంత్రం నిర్జీవిగా ఇంద్రావతి నదికి దక్షిణం వైపున్న రోడ్డు మీదుగా ఆంబులెన్సులో ప్రయాణించి, గోదావరి నది దాటి తెలంగాణ సరిహద్దులోకి ప్రవేశించేంత వరకూ.... అంటే దాదాపు ఇరవయ్యేళ్ల పాటు దండకారణ్యం ఆమె చిరునామాగా నిలిచింది.

ఆమె సాహితీ కృషి గురించి చెప్పుకోవాలంటే... 'భావుకత'తో మొదలై, 'మెట్లమీద', 'ప్రవాహం', 'ఇద్దరు తల్లులు', 'అమ్మ కోసం'.... ఇలా మొత్తం ఆమె రాసిన కథలు 40 వరకు ఉండొచ్చని అంచనా. 'మిడ్కో' పేరుతో కథలు, 'జమీన్' పేరుతో కొన్ని కవితలు, 'బిడి దమయంతి' పేరుతో వుద్యమ నివేదికలు, విశ్లేషణలు రాసింది. ఇంకా 'నిర్మల' అనే పేరుతో కూడా కొన్ని కథలు రాసింది. తర్వాతి కాలంలో ఆమె రాసిన వాటిలో 'పచ్చని బతుకులపై నిప్పయి కురుస్తున్న రాజ్యం', 'మండుతున్న గాయాలు', 'విముక్తి బాటలో నారాయణపట్నా', 'దండకారణ్యంలో గ్రీన్ హంట్' మొదలైనవి ముఖ్యమైనవి. మూసపోత భాషను, రొడ్డకొట్టుడు పదజాలాన్ని వాడకుండా, అనవసర అతిశయోక్తులు లేకుండా సూటిగా, సంక్షిప్తంగా, అర్థమయ్యేలా, పాఠకులను కదిలించేలా రాయడం రేణుక ప్రత్యేకత. అవసరానికి మించి ఒక్క మాట కూడా అదనంగా మాట్లాడని ఆమె స్వభావం ఆమె రచనలో కూడా ప్రతిబింబించేది. తక్కువ మాట్లాడుతూ, ఎక్కువ పరిశీలించడం, ఏదైనా తప్పనిపిస్తే ఎలాంటి మొహమాటం, భయం లేకుండా చెప్పడం, అందరితో ఆప్యాయంగా, నిష్కల్మషంగా మాట్లాడే ఆమె స్వభావం అందరినీ ఆకట్టుకునేది.

మహిళా మార్గంతో మొదలై, విప్లవ పథం, క్రాంతి, ప్రభాత్, పోరు మహిళ, లడెమాయన మహిళ.... లాంటి ఎన్నో పత్రికలకు ఆమె సంపాదకత్వం వహించింది లేదా వాటి కోసం రాసిందని ఆమె సహచరులు గుర్తు చేసుకుంటారు. శారీరకంగా దుర్బలంగా కనిపించే రేణుక పనిలో అంతులేని పట్టుదలను, ఓపికను ప్రదర్శించేదని, పగలూ, రాత్రి తేడా లేకుండా కంప్యూటర్‌పై పని చేసేదని ఎందరో గుర్తు చేసుకుంటారు. ఒకవైపు పత్రికల నిర్వహణ పనులు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలిగా నాయకత్వ బాధ్యతలు చూస్తూనే దొరికిన

విరామ సమయాల్లో తోటి సహచరులకు ఉత్తరాలు రాస్తుండేది. ఆమె రాసే ఉత్తరాలను వారు అపురూపంగా దాచుకునేవారు. ఆమె వారిని పలకరించే తీరు, వారిపట్ల చూపే ఆప్యాయత, సమస్యలపై ఆమె చేసే విశ్లేషణ... వీటిని గుర్తు చేసుకుంటూ కన్నీరు పెట్టనివారు లేరంటే అతిశయోక్తి కాదు. ఉద్యమం నుంచి బయటకు వెళ్లిపోయిన వారిలో కూడా కొందరు ఇప్పటికీ ఆమె ఉత్తరాలు దాచిపెట్టుకున్నారంటే ఆమె ఎలా వారిపై చెరగని ముద్ర వేసిందో అర్థం చేసుకోవచ్చు.

2014లో తన అన్న ఉద్యమం నుంచి బయటకు రావడం రేణుకను నిరాశపర్చింది. ఆయన లొంగుబాటును ఆమె వ్యతిరేకించింది. తాను మాత్రం చివరి ఊపిరి ఉన్నంత వరకూ విప్లవపథాన్ని వీడనని తల్లిదండ్రులకు లేఖ రాసింది.

చివరగా... ఒక కమ్యూనిస్టు విప్లవకారిణిగా, రచయితగా, సంపాదకురాలిగా ఆమె చేసిన కృషినంతా కుటుంబంగా మేం సమగ్రంగా అర్థం చేసుకోలేకపోవచ్చు. తెలుసుకోలేకపోవచ్చు. బహుశా ఎన్నటికీ తెలియను కూడా తెలియకపోవచ్చు. కానీ అంచెలంచలుగా ఎదుగుతూ, తాను నమ్మిన లక్ష్యం కోసం చివరి వరకూ పట్టుదలగా నిలబడ్డ రేణుక జీవితం మాకు ఎల్లప్పటికీ గర్వకారణంగా ఉంటుంది. శ్రమజీవుల కష్టాలు తొలగిపోవాలని, దోపిడీ పీడనలు లేని సమసమాజం రావాలని, మహిళలపై వివక్ష, అణిచివేతలు లేకుండా పోవాలని, కుల నిర్మూలన జరగాలని, కులహంకార దాడులు లేకుండా పోవాలని, మతతత్వం నశించాలని ఆమె కన్న కలలను నిజం చేయడం మనందరి కర్తవ్యం. దానికి ఆమె అమరత్వం మనకు ప్రేరణగా నిలవాలి. ఎందుకంటే... ఆమెది మామూలు చావు కాదు.. ఒక కథలో ఒక తల్లి సంభాషణగా రాసినట్టు, ‘ఊరి నడిమధ్యన గోరయి నిలిచే అసువంటి సావు!’

❖❖❖



*చిన్నతనంలో... రేణుక*

# కథల గనిలో మెరిసిన 'మిడ్కో'

*– పాణి*

ఆ మిణుగురు పువ్వు ఎన్నటికీ వాడిపోదు. ఆ కాంతులు తెలుగు విప్లవ కథా చరిత్రలో దేదీప్యమానంగా నిలిచిపోతాయి. మిడ్కో అనే గోండీ పదం తెలుగు విప్లవ సాహిత్యోద్యమానికి అత్యంత సన్నిహితమై, దేశీయ గుబాళింపులను అద్దుతూనే ఉంటుంది. గుమ్మడవెల్లి రేణుక మిడ్కో అనే పేరుతో కథలు రాయడం వెనుక అత్యద్భుతమైన రాజకీయ సాంస్కృతిక పరిణామం ఉన్నది. కేవలం అదొక రచయిత్రి కలం పేరు మాత్రమే కాదు. తెలుగు కథకు దండకారణ్యం ఒక కాల్పనిక గనిగా మారడం వల్ల ఆమె అలాంటి కథలు రాసింది. విప్లవంలో మానవ వ్యక్తిత్వ వికాసాలను కథలుగా చెప్పగల సాంస్కృతిక స్థాయికి రేణుక చేరుకోవడమే దీనికి గీటురాయి.

జి. రేణుకాదేవి అనే పేరుతో ఆమె మొదట్లో కథలు రాసేది. భావుకత అనే తొలి కథ 1994 జూలై సంచికలో 'ఆహ్వానం' మాసపత్రికలో అచ్చయింది. ఆ తర్వాతి కథ 'మార్పు ఎవరిలో' 1995 జనవరి–జూన్ 'మహిళా మార్గం' పత్రికలో అచ్చయింది. తొలి దశలో రాసిన కథలన్నీ సుమారుగా మహిళా మార్గం పత్రికలో వచ్చాయి. ఆమె స్వతహాగా పట్టణ, మధ్య తరగతికి చెందినది కావడం వల్ల మొదట్లో అలాంటి కథలే రాసింది. నేపథ్యం, పాత్రలు ఆమెకు సుపరిచితమైనవే అయినా అప్పటికే ఆమెకు పట్టుబడుతున్న విప్లవ, ప్రజాస్వామిక చైతన్యంతో ఆ కథలు రాసింది. ఆ తర్వాత కార్యరంగం పట్టణ మహిళా ఉద్యమం నుంచి అజ్ఞాత విప్లవోద్యమం దాకా విస్తరించింది. దీనితో ఆమె కథా వస్తువు కూడా మారిపోయింది. విప్లవాన్ని అర్థం చేసుకొనే తీరు కూడా మారింది. మిడ్కో అనగానే గుర్తుకు వచ్చే 'మెట్ల మీద' అనే కథ కూడా ఆమె తొలి దశలోనే రాసింది. అప్పటికే విప్లవాన్ని ఒక సుదీర్ఘమైన విలువల క్రమంగా స్వీకరించింది. అలుపెరుగుని ఆచరణగా అర్థం చేసుకుంది. 2001 సెప్టెంబర్–అక్టోబర్ 'అరుణతార' సంచికలో ఈ కథ అచ్చయింది. 2005లో విప్లవోద్యమంలోకి వెళ్లాక మిడ్కోగా మారిపోయింది.

ఈ రెండో దశ మిడ్కో కథలకు ఒక చారిత్రక ప్రాధాన్యత ఉన్నది. అది తెలుగు కథా చరిత్రకు సంబంధించిందే కాదు, మొత్తంగా విప్లవోద్యమానికి సంబంధించి కూడా. చాలా వేగంగా, సంక్లిష్టంగా మారుతున్న సామాజిక చలనాలను మిడ్కో దండకారణ్య పోరాటాల వెలుగులో చూసి కథలు రాసింది. చాలా మంది మేధావులు,

సామాజిక విశ్లేషకులు ఈ దశ ప్రజా పోరాటాలను అర్థం చేసుకున్నదాని కంటే భిన్నంగా లోపలి నుంచి రేణుక పరిశీలించింది. సాహిత్యానికి రూపం చాలా ప్రధానమే అయినా, సామాజిక జీవితాన్ని వ్యక్త రూపాల్లో చూసి రాయడానికి కుదరదు. రాసినా అది సాహిత్యం కాదు. కళాత్మకం అసలే కాదు. వ్యక్తమవుతున్న జీవితం వెనుక అవ్యక్తంగా ఉన్న వాస్తవికతను ఎత్తి చూపడమే సాహిత్యం పని అని గ్రహించింది. జీవితంలో, పోరాటంలో వుండగల అవ్యక్త శక్తిని వెలికి తీయడానికి సాహిత్యాన్ని మించిన సాధనం లేదు. అందునా కథలు, నవలలకు సాటి రాగల ప్రక్రియలు లేవు.

మిడ్కో 2005 నుంచి ఇప్పటి దాకా అంటే సుమారు ఇరవై ఏళ్లలో రాసిన కథలన్నీ సుమారుగా విప్లవోద్యమం లోపలి పరిణామాలను చిత్రించినవే. దేశ ప్రజలందరి మీద అణచివేత తీవ్రమైన ఈ వర్తమాన యుద్ధ వాతావరణంలో 2025 మార్చి 31న ఆమె తన పాఠకులకు, మిత్రులకు దూరమై పోయింది. ఇది ఆధునిక భారతదేశ చరిత్రలో చాలా కీలకమైన మూల మలుపును సూచిస్తోంది. ఈ పరిణామాలన్నీ 2005లోనే మొదలయ్యాయి. ఒక్క విప్లవోద్యమంలోనే కాదు, సాధారణ మానవ జీవితంలో అంతకు ముందుకంటే తీవ్రమైన విధ్వంస రూపాలు అప్పుడే మొదలయ్యాయి. 2014 నాటికి మరింత తీవ్రమయ్యాయి. ఈ పరిణామాలతో నిమిత్తం లేకుండా రేణుక కథలను అర్థం చేసుకోలేం. చాలా సంక్షోభితంగా, నిస్సహాయంగా కనిపిస్తున్న ఈ సంఘర్షణ రూపాలను మాత్రమే చూసినవారికి ఎందుకు ఇట్లా జరుగుతున్నదో తెలుసుకోవడం కష్టం. ఇది ఏమవుతుందో అనే సందిగ్ధత వెంటాడుతుంది.

బైటికి స్పష్టాస్పష్టంగా కనిపించే ఈ పరిణామాలను మిడ్కో కథలుగా విడమర్చి చెప్పింది. అనేక పరిణామాల రూపాలను, సారాన్ని కలిపి కథా ఇతివృత్తాలను ఎంచుకున్నది. తీవ్రమైన సంఘర్షణ జరుగుతున్న సమయంలో వచ్చే ఇలాంటి సాహిత్యం పాఠకులకు ఎరుకను అందిస్తుంది.

మిడ్కో రచనలను కేవలం కథ కోసమే ఎవ్వరూ చదవకపోవచ్చు. అందులో అద్భుతమైన కథ ఉండొచ్చు, దానికి తగిన కథనం కూడా ఉండవచ్చు. కానీ కేవలం ఒకానొక ఘటనను కాల్పనీకరించి కథ చేసి రేణుక సరిపెట్టుకోదు. ఈ కథ స్థల కాలాల చారిత్రక స్వభావాన్ని గ్రహించి, దాని అంతరార్థాలను వెలికి తీయడానికి ఆమె ప్రయత్నిస్తుంది. ఈ ఇరవై ఏళ్ల సామాజిక, ఉద్యమ పరిణామాల అట్టడుగు వాస్తవికత చాలా వరకు రేణుక కథల్లో కనిపిస్తాయి. దాన్ని చెప్పడమే ఆమె కథన వస్తు శిల్ప సమ్మేళనం. దీనితో విడదీయలేని దృక్పథాన్ని ఆమె ప్రజా ఆచరణలోంచి స్వీకరించింది. అందువల్ల పైకి విధ్వంసంగా కనిపించే ఘటనలు, పరిణామాలు రేణుక కథల్లో నిర్మాణంగా కనిపిస్తాయి. రూపంలో కనిపించే పరిమితుల విస్తృతిని ఎత్తి చూపుతాయి. బైటికి కనిపించే 'హింస' దాపున ఉండే మానవీయత, ప్రేమ, సజ్జన స్వభావం మిడ్కో కథలు వివరిస్తాయి. మొత్తం మీద మానవ జీవితంలోని క్రమాలను సంఘర్షణాయుతంగా తీర్చిదిద్దిన కథలు రాసింది.

ఇవేవీ పాపులర్ మీడియాకు కనిపించకపోవచ్చు. సాధారణ విశ్లేషణలకు లొంగకపోవచ్చు. కానీ మానవ జీవితంలో, విప్లవంలో సాహిత్యం నిర్వహించే పాత్ర తెలిసిన రచయిత్రిగా రేణుక కంటికి కనిపించని ఆవలి విషయాలను చాలా అలవోకగా కథ చేస్తుంది. మిడ్కో అనే పదమే దండకారణ్యానికి సంబంధించింది కాబట్టి, ఆ సువిశాల ప్రాంతపు పోరాట వికాసాన్నంతా ఆటుపోట్ల మధ్యనే ఆమె కథల్లో చదువుకోవచ్చు. సల్వాజుడుం, ఆపరేషన్ గ్రీన్‌హంట్ కాలాల్లో ఆమె మిడ్కోగా మారి, ఆ కాలపు కథలను తెలుగు పాఠకులకు అందించింది.

రాజకీయ, పోరాట ఇతివృత్తాలను ఎన్నుకొన్నప్పటికీ వాటితో సంబంధం లేని పాఠకులు కూడా చదివే ఆసక్తికరమైన శిల్పంలో రాసింది. ముఖ్యంగా తీవ్రమైన రాజకీయ, సైనిక సంఘర్షణలను మానవ సంబంధాల వైపు నుంచి రాయడం వల్ల సగటు పాఠకుల దగ్గరికి కూడా ఆమె తాను ఎంచుకున్న ఇతివృత్తాన్ని చేర్చగలిగింది. ఆమె రాసిన 36 కథల్లో సగం మైదాన ప్రాంత, మధ్య తరగతి, శ్రామిక ప్రజల ఇతివృత్తాలు ఉంటే మిగతావన్నీ యుద్ధకాలపు కథలని చెప్పవచ్చు. 2007లో 'మెట్ల మీద' అనే పేరుతో కథా సంపుటి వచ్చే నాటికే ఆమె కథకురాలిగా తెలుగు పాఠకుల గుర్తింపు పొందింది. అప్పటికే ఆమె దండకారణ్య విప్లవోద్యమంలో భాగమైంది. ఆ తర్వాత రాసిన కథలు ఇటీవల విడుదలైన 'వియుక్క' ఆరు సంపుటాల్లో భాగమయ్యాయి.

1990లలో స్త్రీవాదం గట్టిగా వినిపిస్తున్న రోజుల్లో విప్లవ మహిళా ఉద్యమంలోకి వచ్చిన రేణుక స్త్రీల విముక్తిని మానవాళి విముక్తిలో భాగం అని గ్రహించింది. దాని కోసం అనేక వుద్యమాలు చేయడమేగాక రచనలు చేసింది. ఈ కాలమంతా మహిళా ఉద్యమం విప్లవోద్యమంలో భాగంగా అనేక ప్రయోగాలు చేసింది. ఈ క్రమమంతా సాగిన మిడ్కో తన జీవితంతో కూడా ఎన్నో ప్రయోగాలు చేసింది. ఉజ్వలమైన తెలుగు కథా చరిత్రలో మిరమిట్లు గొలిపే ఈ మిణుగురు పువ్వును క్రూరమైన కాలం భరించలేకపోయింది. ఆ వెలుగును చూసి సహించలేకపోయింది. ఇప్పుడు ఆమె ఇక కథలు రాయలేకపోవచ్చు. అద్భుతమైన పోరాట కథలా, ముగింపు లేని గాథగా మిగిలే ఉంటుంది.

***– 'దిశ' ఆన్‌లైన్ దినపత్రిక, 2 ఏప్రిల్ 2025***



*తల్లిదండ్రులతో రేణుక*

# వెలుగును పంచిన మిణుగురు

***– తాయమ్మ కరుణ***

రేణుక అమరురాలైందని తెలిసినప్పటి నుంచి ఎడతెగని ఆలోచనలు. దుఃఖం.

రష్యా విప్లవ కాలంలో రాసిన నవల అది. ఆ నవలలో విప్లవకారులున్న భవనాన్ని జార్ ప్రభుత్వ సైన్యం చుట్టుముడుతుంది. చాలా మంది చనిపోతారు. ఒక కామ్రేడ్ బహుశా గోడకున్న మాళిగలో దాక్కుంటాడు. అప్పుడు కొన్ని రోజులు సైన్యం భవనాన్ని చుట్టుముట్టి ఉంటుంది. బయటకు రాలేని పరిస్థితి. మళ్లీ కొన్ని నెలల తర్వాత సైన్యం ఆ భవనానికి వచ్చినప్పుడు ఆ కామ్రేడ్‌ను చూసి ఓ సైనికుడు భయంతో కేకలు వేసి తనవారిని పిలుస్తాడు. వాళ్లు అతడిని బయటికి తీస్తారు. అన్ని నెలల తర్వాత ఎండను చూసి తట్టుకోలేకపోతాడు. చిక్కిశల్యమై, కనుగుండ్లు బయటకు పొడుచుకొచ్చి ఎముకల గూడులా మారిన ఆ కామ్రేడ్‌ను చూసి సైనికులు భయపడతారు. ఇప్పటికైనా సరెండర్ కమ్మని అడుగుతారు. అందుకు ఆ కామ్రేడ్ ఒప్పుకోడు. విప్లవ నినాదాలు చేస్తూ కొద్ది క్షణాల్లోనే చనిపోతాడు. చనిపోయిన రేణుక ఫోటోను చూస్తే నవలలోని ఆ కామ్రేడ్ గుర్తుకు వచ్చాడు.

రేణు ఫొటోను చూస్తే దుఃఖం అసలు ఆగలేదు. ఎముకల మీద చర్మం మాత్రమే వుందా అన్నట్టుగా కనిపిస్తోంది. అంతగా బక్కచిక్కిపోయింది. తను బక్కపల్చటి మనిషే. కానీ మరీ ఇంతలా కాదు. తీవ్రమైన అనారోగ్యంతో వున్న రేణుకను ఒక గ్రామంలో ఉంచారట. దాదాపుగా నెల రోజులుగా అదే గ్రామంలో వుంటోందట. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి వచ్చి వెహికిల్ మీద అడవిలోకి తీసుకెళ్లి కాల్చి చంపారట.

అరుణారుణ జోహార్లు రేణుకా! ఇంతకు మించి నీకు నివాళులు ఎట్లా అర్పించగలం!!

అక్కడున్న పరిస్థితి ఏంటో తెలియదు కానీ నువ్వు బయటకు వచ్చి, ఇంట్లో వాళ్లను కాంటాక్టు చెయ్యాల్సింది. రహస్యంగా ట్రీట్‌మెంట్ తీసుకోవాల్సింది అని మనసు అక్రోశిస్తోంది రేణు.

రేణుక మొదట తన కథల ద్వారా నాకు పరిచయం. తను విప్లవోద్యమంలోకి పూర్తికాలం రాకముందు నుంచే కథలు రాయడం ప్రారంభించింది. నేను చదివిన మొదటి కథ తనది 'భావుకత'. 'ఆహ్వానం' పత్రికలో అచ్చయింది. రేణుక పేరుతోనే రాసింది. అలాగే నిర్మల, జమీన్, మిడ్కో పేర్లతో కూడా కథలు రాసింది. దమయంతి పేరుతో దండకారణ్యం (డి.కె.)లో ఆదివాసీలపై ప్రభుత్వ దమనకాండను, మరికొన్ని పుస్తకాలను రాసింది.

మిడ్కో గోండీ పదం. అర్థం 'మిణుగురు' అని. తన అన్న వెంకటకిషన్ ప్రసాద్ సహచరి మిడ్కో (ఆదివాసీ

అమ్మాయి) ఉద్యమంలో 1999 జులైలో అమరురాలైంది.

ఈ సందర్భంగా మిడ్కో గురించి కూడా రెండు వాక్యాలు... మిడ్కో గురించి ఐ.వి. సాంబశివరావు మాస్టారు చాలాసార్లు మా దగ్గర ప్రస్తావించేవారు. 'క్రాంతి' పత్రిక యూనిట్‌లో మేము (నేను, మంజీర–మరం రవికుమార్) పని చేస్తున్నప్పుడు మాస్టారు నిత్యం మా దగ్గరికి వచ్చేవారు. ఆ క్రమంలో ఎన్నో కబుర్లు. మాస్టారు సంవత్సర కాలం దండకారణ్యంలో పనిచేశారు– అక్కడి ఉద్యమాన్ని పరిశీలించడానికి, నేర్చుకోవడానికి. కమాండర్‌లు నెలకోసారి అందరి కిట్‌లను చెక్ చేసేవారట – అనవసరమైన బరువులను తీసివేయడానికి. అనవసర బరువులు ఎప్పుడూ ఆటంకమే. మాస్టారు చదువుకోడానికి కొన్ని పుస్తకాలను దళ కామ్రేడ్స్‌కి ఇచ్చారట. ఒకటి, రెండు పుస్తకాలుంటే పర్వాలేదు కానీ, ఎక్కువ పుస్తకాలుంటే డంపు చేస్తారు. చదవడం అయిపోయిన తర్వాత మళ్లీ తెప్పించి ఇస్తారు. అయితే ఈ మిడ్కో దగ్గర కూడా మాస్టారివి పుస్తకాలు రెండు వుండెనట. అవి దళకమాండర్ తీసేస్తాడని వాటిని చెట్టుమీద పెట్టి వచ్చిందట. కమాండర్ కిట్ చెకింగ్ అయిపోయిన తర్వాత మళ్లీ తన బ్యాగులో పెట్టుకుందట. అలా వాటిని మోస్తూనే వుందిట. మాస్టారు ఓ ఆర్టికల్ అర్జంటుగా రాయాల్సి వచ్చి, రిఫరెన్స్ కోసం ఆ పుస్తకం అవసరమైందట. అప్పటికి దళం డంపు పెట్టిన ప్లేస్ నుంచి చాలా దూరం వెళ్లిపోయిందట. దానిని డంపు నుంచి తెప్పించి ఇవ్వలేని పరిస్థితి. మాస్టారు కమాండర్‌తో ఆ పుస్తకం తెప్పించాలని మాట్లాడుతుంటే విన్న మిడ్కో తన బ్యాగులో నుంచి తీసి ఇచ్చిందట. మాస్టారు ఎప్పుడూ ఈ విషయం చెప్పి, 'బదుద్దాయి' అని నవ్వేవారు. నేను, మా రవి డి.కె.కు వెళ్లిన కొత్తలో మాకూ కలిసింది. చాలా యాక్టివ్‌గా వుండేది – ప్రవాహంలా.

మిడ్కో పేరునే తన కలం పేరుగా పెట్టుకుంది రేణుక. తన కథలు చాలా వరకు పాత్రల అంతఃసంఘర్షణతో కూడి ఉండేవి. తన కథలంటే నాకు చాలా ఇష్టం.

డి.కె.లో నేను ఉన్నప్పుడు తనున్న వీడియో ఒకటి చూశాను. ఏఓబీలో జరిగిన ఓ మిలిటరీ క్యాంపునకు తను అటెండ్ అయిన వీడియో అది. తనను ప్రత్యక్షంగా కలిసింది మాత్రం 2004 చర్చల టైమ్‌లో. అంతకుముందే తన గురించి విని వుండటం, వీడియోలో చూసి ఉండటం వల్ల వెంటనే గుర్తుపట్టాను. నా గురించి తను కూడా విని వుండటం వల్ల కావచ్చు తను కూడా నన్ను గుర్తుపట్టింది. బక్కపల్చగా ఉండేది. ఎత్తు కూడా ఎక్కువే.

నల్లమలలో నేను ఆర్.కె. (రామకృష్ణ) టీమ్‌లో 'విప్లవ మహిళ' ఎడిటర్‌గానూ, కంప్యూటర్ వర్క్‌లో వుండేదాన్ని. కంప్యూటర్, దానికి సంబంధించిన సామాన్లు ఉండటం వల్ల ప్రత్యేకమైన టెంట్ వేసేవాళ్లు. అప్పుడు తను నాతోపాటే టెంట్‌లో ఉంది. తక్కువగా మాట్లాడేది. తనకు తాను కల్పించుకుని మాట్లాడటం చాలా తక్కువ. అన్నానికి, ఛాయ్‌కి వెళ్లేటప్పుడు మాత్రం నా కోసం తప్పకుండా ఆగేది. ఇద్దరం కలిసే వేళ్లేవాళ్లం. ఒకోసారి కంప్యూటర్ పనిలో నేను వుంటే ఛాయ్ తీసుకువచ్చి ఇచ్చేది. తను తక్కువగా మాట్లాడినా బహుశా అందువల్లనే కావచ్చు మా మధ్య 'గ్యాప్' ఉన్నట్టు అనిపించేది కాదు.

తను ఎందుకు వచ్చిందో నాకు తెలియదు. జనరల్‌గా అడగము కూడా. శాఖమూరి అప్పారావే ఓసారి 'పెళ్లి చేసుకోబోతున్నానని, ఆమె ఇక్కడే ఉందని, ఎవరో కనిపెట్టు' అన్నారు. అప్పుడు క్యాంపులో ఇద్దరు అమ్మాయిలు కొత్తవాళ్లు ఉన్నారు. ఒకరు రేణుక, మరొకరు ఇంకో అమ్మాయి. అప్పటికే సంతోష్‌రెడ్డి చనిపోయి 5 సంవత్సరాలు అవుతోంది. తను మళ్లీ పెళ్లి చేసుకున్నట్టు లేదు. అందుకని, రేణుకనే అయ్యివుండవచ్చు అని తన పేరు చెప్పాను. అప్పారావు నవ్వాడు.

ఆ క్యాంపులో ఓసారి రేణుక మాట్లాడుతూ... తను విరసం కథల వర్క్‌షాపుకి వెళ్లానని, చాలా మంచి చర్చ జరిగిందని, అల్లం రాజయ్య గారు ఆ వర్క్‌షాపులో మాట్లాడుతూ కథల్లో అంకెలు, సంఖ్యలు ఎప్పుడూ వాడకూడదని, వాటిని అక్షరాల్లో రాయాలని చెప్పారని, అది తనకు కొత్త విషయమని చెప్పింది. నిజానికి నాకు కూడా అది కొత్త విషయమే. తను అప్పుడు వైజాగ్‌లో పని చేస్తున్నట్టుంది.

మరోసారి 2005లో శాఖమూరి అప్పారావును కలవడానికి వచ్చింది. బహుశా అది మార్చి నెల అనుకుంటా. ఆకు రాలుతుంది. ఎండ పడకుండా దుప్పట్లు కట్టుకుంటున్నాము. అక్కడ వుండేది కొద్దిరోజులే కాబట్టి కంప్యూటర్ టెంట్ వేయలేదు. అప్పుడు కూడా తను పగలంతా నా దగ్గరే వుండేది. తనకు వేరే పాలిథిన్ వుంది. కానీ వేసుకోకపోయేది. నా దగ్గరే వుండేది. ఇదిగో... ఇప్పుడు... ఇన్నేండ్ల తర్వాత 55 ఏండ్లు నిండకుండానే నిర్జీవమైన రేణుకని మళ్లీ కలవబోతున్నాను.

విప్లవోద్యమంలో పనిచేసిన మహిళా కామ్రేడ్స్ మధ్య తెలియని బంధమేదో అల్లుకుని వుంటుంది. ఈ సమాజం నుంచి ఎన్నో ఎదుర్కొన్నవాళ్లంగా, సమాజ మార్పులో భాగమైనవాళ్లంగా, మా మధ్య అనుబంధమేదో పెనవేసుకుని వుంటుంది. మమేకతేదో మమ్మల్ని ఒక్కటిగా కలిపి వుంచుతుంది.

గతంలో మిడ్కో కథలు 'మెట్లమీద' పేరుతో సంపుటిగా వెలువడ్డాయి. ఇటీవల విరసం ప్రచురించిన 'వియ్యుక్క' సంకలనాలు వెలువడే వరకు తను రాసిన అన్ని కథలు వాటిల్లో చోటు చేసుకున్నాయి. ఈ కథలు చదివితే తనేంటో, తన ఆలోచనా రీతి, జీవితం పట్ల తనకున్న స్పష్టత అర్థమవుతుంది.

**రేణుక బాల్యం, చదువు**

రేణుక తల్లిదండ్రులు గుమ్మడవెల్లి యశోద (జయమ్మ), సోమయ్యలు. సోమయ్య సారు ప్రభుత్వ వుపాధ్యాయులుగా పని చేసి రిటైర్డ్ అయ్యారు. వీరికి ముగ్గురు పిల్లలు. రేణుకకు ఒక అన్న, ఒక తమ్ముడు. అన్న వెంకటకిషన్ ప్రసాద్ విప్లవోద్యమంలో పని చేసి సరెండర్ అయ్యారు. తెలుగు బీబీసీలో పని చేస్తున్నాడు. తమ్ముడు రాజశేఖర్ అడ్వకేట్. మధ్యతరగతి పద్మశాలి కుటుంబం.

రేణుక 1970 అక్టోబర్‌లో పుట్టింది. స్వగ్రామం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కడవెండి. ప్రాథమిక విద్య కడివెండిలోనే చదివింది. వాళ్ల అమ్మమ్మ ఊరు మోత్కూరులో 8, 9 తరగతులు, 10వ తరగతి దేవరుప్పలలో పూర్తి చేసింది. ఇంటర్ జనగామలో చదివింది. ఇంటర్ అయిపోగానే పెళ్లి చేశారు. కొద్దికాలంలోనే విడాకులు తీసుకున్నది.

విడాకులు అయిన తర్వాత డిగ్రీని దూరవిద్య ద్వారా పూర్తి చేసింది. ఎల్ఎల్‌బి తిరుపతిలో చదివింది. ఈ క్రమంలోనే అక్కడి మహిళా సంఘంలో యాక్టివ్‌గా పాలుపంచుకోవడం ప్రారంభించింది. అప్పటికే తన అన్న వుద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా కొనసాగుతున్నారు. దానికితోడు తనకు జీవితంలో ఎదురైన సమస్యలు. ఈ నేపథ్యంలో తను కూడా విప్లవోద్యమంలో పూర్తికాలం పని చేయాలని నిశ్చయించుకుంది.

అయితే తిరుపతిలో యాక్టివ్‌గా పలు పోరాటాల్లో పాల్గొంటున్న కాలంలోనే కామ్రేడ్ ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిని పెళ్లి చేసుకుంది. అప్పటికి సంతోష్‌రెడ్డి పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ సభ్యుడు. పెళ్లి అయిన సంవత్సరంన్నర కాలవ్యవధిలో ఆయన ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యారు. సహచరుడు అమరుడైనా... తన దుఃఖాన్ని బహిరంగంగా పంచుకోలేని స్థితి రేణుకది.

**పూర్తి కాలం కార్యకర్తగా...**

ఆ తర్వాత కాలంలో రేణుక కార్యరంగం విశాఖకు మారింది. విశాఖలో కౌముది (తరాలపల్లి)తో కలిసి పనిచేసింది. వీరి మధ్య సాహిత్య చర్చలు బాగా జరిగేవి. ఇక్కడి నుంచే బహిరంగ జీవితాన్ని వదిలి అజ్ఞాత జీవితంలోకి దళాల్లోకి వచ్చింది. అంచెలంచెలుగా ఎదిగి స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలైంది. ప్రభాత్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టింది. పార్టీలో రాష్ట్రకమిటీ సభ్యులుగా ఎదిగిన మహిళలు అతికొద్ది మంది. అందులో రేణుక ఒకరు. ఇటీవలనే నర్మదక్క, రాష్ట్రస్థాయి నాయకురాలు ఉర్మిళ అమరురాలయ్యారు. ఇప్పుడు రేణుక.

రేణుక మరణం పార్టీకి, ప్రజలకు తీరని నష్టం. రేణుకది చనిపోయే వయసా? ఇంకా చాలా కాలం బతకాల్సింది. బతికినంత కాలం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నది. చివరికంటా ఉద్యమంలోనే కొనసాగింది.

**చివరగా... మరోమాట**

ఒక్కతే అమ్మాయి అవ్వడం వల్లనేమో ఇంట్లో వాళ్లందరికీ రేణుక అంటే విపరీతమైన ప్రేమ. అమ్మకు మరీ ఎక్కువ. అల్లారు ముద్దుగా పెంచుకున్న కూతురిని అత్తింటివారు పెడుతున్న ఇబ్బందులను చూసి యశోదమ్మ తట్టుకోలేకపోయింది. తన కూతురు బతికుంటే చాలని ముందుబడి విడాకులు ఇప్పించిందని విన్నాను. కూతురు విప్లవోద్యమంలోకి పోయినప్పుడు అల్లాడిపోయింది. బిడ్డ చేస్తున్న పని మంచిదే. కానీ కండ్ల ముందర లేదనే బాధ ఆమెను నిరంతరం వెంటాడింది. ఆ బాధతోనే రేణుక పూర్తికాలం ఉద్యమ జీవితంలోకి వెళ్లిన కొత్తలో... 'నా బిడ్డను పంపి మీరు బయట బతుకు తున్నారా' అని రేణుక స్నేహితుల మీద ఆగ్రహాన్ని వ్యక్తం చేసేది. వెంటనే 'మీరూ మా చిట్టెమ్మలాంటి వాళ్లేనమ్మ. తను కండ్ల ముందట లేదన్న బాధతో అట్లన్న' అని మళ్లీ తనను తాను సంభాళించుకునేది. బిడ్డ రాసిన ఉత్తరాలను పదే పదే చదువుకునేది. హైదరాబాదులోనే వుంటున్నప్పటికి బిడ్డ యాదికి వచ్చినప్పుడు మోత్కూరు వెళ్లేది. ఎందుకంటే బిడ్డ రాసిన ఉత్తరాలను ఆ ఊర్లోనే దాచుకునేది. ఊరికి వెళ్లగానే బీరువాలో దాచుకున్న ఉత్తరాలని చదువుకునేది. బిడ్డను ఒక్కసారన్నా కండ్ల చూడాలని ఏండ్లుగా ఎదురుచూస్తోంది యశోదమ్మ. 'బిడ్డను చూసుకున్న తర్వాత తను వున్నా, సచ్చిపోయినా పర్వాలేదు' యశోదమ్మ ఎప్పుడూ అనేమాట. ఆ బిడ్డను రేపు చూడబోతోంది అమ్మ.

రేణుక అలియాస్ మిడ్కో అలియాస్ చిట్టెమ్మ రేపు కడివెండి నడిబొడ్డున కాలూనబోతోంది.

రేణూ... నీ తలపులు, నీ ఆశయం ఎప్పటికీ సజీవమే!

***– 'కొలిమి', మార్చి 31, 2025***

❖❖❖

# మిడ్కో కథలు

**– పి వరలక్ష్మి**

మిడ్కో నాకు చాలా ఇష్టమైన రచయిత. ఆమె కథల ద్వారా ఆమె వ్యక్తిత్వాన్ని, రూపాన్ని ఊహించుకుంటూ ఉండేదాన్ని. 'అమ్మ కోసం' కథ నా విద్యార్థులకు ఇప్పటికి కొన్ని పదుల సార్లు చెప్పి ఉంటాను. ఆ కథ చదివితే ఎవరికైనా 'అమ్మ'ను చూసే దృష్టి మారుతుంది. మిడ్కో కథలు మగపిల్లలందరూ తప్పనిసరిగా చదవాలని అనిపిస్తుంది. ఇటువంటి సాహిత్యం చదివితేనే నిజమైన ప్రేమను తెలుసుకోగలరు, అనుభూతి చెందగలరు. వీటికి దూరంగా పెరిగేవాళ్లు చాలా కోల్పోతున్నట్లు. మిడ్కో మరణంతో మనం ఎంతో కోల్పోయాం. ఆ వెలితి తీరాలంటే ఆమెను ఇంకా ఇంకా తెలుసుకొని ఆ అద్భుతమైన వ్యక్తిత్వాన్ని మనలో భాగం చేసుకోవాలి. నిజానికి 'నిర్మూలన' అని మొదలుపెట్టాక పైకి కనపడుతున్న శవాల లెక్కల వెనక కనీసం మూడు నాలుగు తరాల మహోన్నత మానవ ప్రయత్నంలో రూపొందుతున్న గొప్ప సంస్కృతి విలువల్ని ధ్వంసం చేసే ప్రయత్నం జరుగుతున్నదని ఈ సమాజం గుర్తించలేకపోతోంది. మిడ్కో వంటి వాళ్ళు ఎటువంటి ఆలోచనలు చేశారు, ఎటువంటి సమాజాన్ని నిర్మించాలనుకున్నారు తెలుసుకోవాలంటే 'మెట్ల మీద' కథలు చదవాలి.

చాలా ఏళ్ల క్రితం, అప్పుడప్పుడే రచనలు చేస్తున్న తొలిదశలో మిడ్కో కథల్ని పరిచయం చేసే ప్రయత్నం చేశాను (అప్పటికింకా ఆమె కథా సంకలనం వెలువడలేదు). అది చాలా ప్రాథమికంగా ఉంటుంది గాని నాకదొక జ్ఞాపకం. ఇప్పటికిప్పుడు ఏం రాయాలో తోచక దానిని గుర్తుచేసుకుంటూ మీతో పంచుకుంటున్నా.

❖

మిడ్కో కథలు, పురుషాధిపత్య సమాజంలో కంటికి కనిపించని హింసారూపాలను వెలికితీస్తాయి. అంతేకాక మాటల్లోనూ చేతల్లోనూ అడుగడుగునా వ్యక్తమయ్యే వివక్ష, పీడన అణచివేతలను విడివిడిగా కాకుండా వ్యవస్థలో భాగంగా చూసే దృక్పథం ఈ కథల్లో ఉన్న బలం. స్త్రీ పురుష సంబంధాల్లోని సున్నితమైన పార్శ్వాలు కొన్ని కథల్లో వ్యక్తమైన తీరు అబ్బురపరుస్తుంది. ప్రకృతిని చూసి మానసికోల్లాసాన్ని పొందటంలో స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసం ఉంటుందా? వెన్నెలను, వెండి మబ్బులను, మంచు ముత్యాల్ని, వర్షపు జల్లులను ఆస్వాదించే భావుకత ఒక భర్తలో ఉన్నంతగా భార్యలో ఉండదా? అంటే ఆ భార్య మనసును చదివితే ఇట్లా ఉంటుంది (భావుకత).

"మీరు సూర్యోదయాల్ని చూస్తూ పరవశించే వేళ
మీ కోసం మేం కాఫీలు కలుపుతూ ఉంటాం
మీరు వర్షాన్ని చూసి పులకరించే వేళ
మీ కోసం మేం వేడి వేడి పకోడీలు వేస్తూ ఉంటాం
మీరు హాయిగా ఆదమరచి నిద్రపోయే వేళ
మీ పిల్లలకు మేం పాలిస్తూ జోకొడుతూ ఉంటాం!"

'భావుకుడై'న భర్త అభిరుచిలేని భార్య దొరికినందుకు అసంతృప్తి వ్యక్తంచేస్తే భార్య ప్రతిస్పందన ఎలావుంటుంది. "నేను సరిగ్గా ఆరుగంటలకు వేడి వేడి కాఫీ ఇవ్వకపోతే తనలోని 'భావుకుడు' కిటికీ దగ్గరే పడి చచ్చిపోడూ".

సాధారణంగా కుటుంబంలో భార్య స్థానం 'పనిమనిషి' అనుకుంటూ ఉంటాం. నిజానికి పనిమనిషికి ఉండే స్వేచ్ఛలో కొంతైనా భార్యకు ఉండదు. భార్యకు జీతమూ, రాయితీలూ, హక్కులు అనేవేవీ ఉండవు సరికదా బాధ్యతలు మాత్రం ఉంటాయి. పనిమనిషికైనా ఏదో ఒక పనిలో సహకరిస్తాడేమోకాని భార్య అదే సహాయం కోరితే ఆమె బాధ్యతను గుర్తుచేసి హుంకరిస్తాడు (పనిమనిషి).

స్త్రీ వేసే ప్రతి అడుగులోనూ, నడకలోనూ ప్రతీక్షణమూ ప్రయాణాల్లో, సినిమా హాళ్ళలో, ఆఫీసుల్లో, కాలేజీల్లో ఎంత సాధ్యమైతే అంత, ఎంత వీలైతే అంత అవమానపరచి మానసిక హింసకు గురిచేసి ఆనందించే వ్యవస్థీకృత దుర్మార్గం ఈ సమాజంలో ఉంది. దానిని ప్రతిఘటిస్తే సభ్య సమాజం అంతో ఇంతో సాయపడే పరిస్థితి ఉండి కూడా ఆ అవమానాన్ని పంటి బిగువున భరించే స్త్రీలే ఎక్కువ. అయితే ఇటువంటి అవమానమే భర్త చేస్తే సమాజం దృష్టిలో అతడు చేసేది అవమానం కిందికి వస్తుందా? కుటుంబంలో స్త్రీలపై జరిగే భౌతిక హింసకు చాలా సందర్భాల్లో సామాజిక ఆమోదం ఉంది. అటువంటప్పుడు ఆమె వ్యక్తిత్వాన్ని అవహేళన చేసినప్పుడో, లైంగిక హింసకు గురి చేసినప్పుడో కనీసం దానిని ఒక పీడనగానో, ఒక హింసా రూపంగానో చూడరు (సంకెళ్ళు).

ప్రతిరోజూ స్త్రీలపై జరిగే అనేక అత్యాచారాలకు మూలం ఎక్కడుంది. ఒక మగవాడికి ఒక స్త్రీని అమాంతంగా ఎత్తుకెళ్ళి రేప్ చేసే అధికారం ఎలా వస్తుంది. ఒక చైతన్యవంతమైన విప్లవోద్యమ ఆచరణ నుండి 'పద్మ' వంటి స్త్రీలు చెప్పేది... 'మనం పంటి బిగువున భరించే ప్రతి అవమానం మన అనుమానాల్ని మరింత పెంచుతుందనీ, మన ప్రతి చిన్న లొంగుబాటు కూడా ఎదుటి వాళ్ళకి పెద్ద విజయాన్నే ఇస్తుందని' (ఆమె వ్యక్తిత్వం).

ఒక అమ్మాయి ఎదిగే క్రమంలో ప్రకృతి సహజంగా జరిగే మార్పును సమాజం ఒక వింతగా చూడటం మొదలుపెడితే, కుటుంబ సభ్యుల ప్రవర్తన అసహజంగా మారిపోతే, అది ఆ చిన్నారి మనస్సులో ఎటువంటి ముద్రను వేస్తుంది? (మార్పు ఎవరిలో).

స్వతంత్రంగా ఆలోచించే స్త్రీని సమాజం ఒక 'విద్దూరపు మనిషి'గా చూస్తుంది. వ్యవస్థీకృతమైన పితృస్వామిక ఆధిపత్యపు భావజాలం స్త్రీలలోనూ ప్రతిఫలించడం, అది మాటల్లో చాలా సునాయసంగా వ్యక్తమవడం, తమకు తామే తక్కువ చేసుకొని మాట్లాడటం సాధారణమే అయినా తన హక్కుల కోసం వ్యక్తిత్వం కోసం తీవ్రంగా పోరాడిన 'లక్ష్మి' వంటి స్త్రీలలోనూ అదే లొంగుబాటు ఎందుకు కనిపిస్తుంది? సమాజం దృష్టిలో ఆమె భర్తను

కొంగున ముడేసుకుంది. చిటికెనవేలు మీద ఆడిస్తోంది. మరి తన భర్త లోపాన్ని దాచి సంతానం కలుగకపోవడానికి కారణం తనే అయినట్లు లోపాన్ని తన మీద వేసుకోవడం ఎందుకు అంటే ఒక అనుభవజ్ఞురాలైన స్త్రీ ఇలా చెబుతుంది. 'మొగునికి భయపడక పోయినా ఈ మొగ ప్రపంచానికి భయపడాల్నే ఎవరైనా' (మొగ ప్రపంచం).

భావజాలం ఎంతగా పాతుకుపోయిందంటే అమ్మ కోసం గిఫ్ట్ మిక్సీనో, వాషింగ్ మిషనో కొంటాము గాని ఆమె వ్యక్తిగత అభిరుచుల్ని కనీసంగా గుర్తిస్తామా అని రచయిత సూటిగా ప్రశ్నిస్తుంది. అసలు అమ్మకు సొంతంగా అభిరుచులుంటాయా? ప్రతిదీ భర్త కిష్టమని, కూతురికిష్టమని, కొడుక్కు ఇష్టమని చేస్తుంది. అందరి అభిరుచుల్ని తీరుస్తూ ఆమె అభిరుచుల్లాగే రుచుల్ని కూడా మర్చి పోతుంటుంది (అమ్మకోసం).

విప్లవోద్యమ నేపథ్యంలో రూపుదిద్దుకున్న కథలు విప్లవం నుండి గొప్ప మానవీయ సంస్కృతిని, చైతన్యాన్ని అందిపుచ్చుకున్న ప్రజలు విప్లవకారుల్ని కడసారి చూసుకోవడానికి, శవాల్ని స్వాధీనం చేసుకోవడానికి పోరాటం చేయాల్సిన దుర్మార్గమైన రాజ్యంలో కొడుకుని పోలీసులు చంపేస్తే బిడ్డ జ్ఞాపకాన్ని ఊరి మధ్యలో కట్టడంగా నెలకొల్పడానికి గొప్ప పోరాటాలు చేసిన తల్లులు ఎంతో మంది ఉన్నారు. 'నీ కొడుకు అందరి లాంటి వాడు కాదు, వాడ్ని తలచుకోకూడదు, గోరి కట్టకూడదు, ఏడవకూడదు' అని శాసించే రాజ్యంతో తన కొడుకు ధిక్కారపు వారసత్వాన్ని తన భుజాన వేసుకొని తనే రాజ్యాన్ని సవాలు చేస్తుంది. 'వానిది అందరసువంటి సావు కాదు.. వూరి నడిమధ్యన గోరయి నిలిసే అసువంటి సావు' అని గర్వంగా చెబుతుంది. అంతేకాదు పురిట్లనే బిడ్డను పోగొట్టుకున్న తల్లిని గూడ నీకెంత మంది బిడ్డలు అనడిగితే బతికున్నోళ్ళ గురించీ సెప్తది. పురిట్లనే సచ్చిపోయిన బిడ్డల గురించీ సెప్తంది. అసువంటిది... భూమ్మీద ఇరవై యెనిమిదేండ్లు బతికిన నా కొడుకు గురించి, ఆ బతుకుని గురించి సెప్పాల్నని నాకనిపియ్యదా' అని ప్రశ్నిస్తుంది (జోలపాట).

అసహజ మరణాలు అత్యంత సహజమైపోయిన రాజ్యంలో తమ ఆత్మీయుల ఆఖరి చూపుకు నోచుకొని తల్లులు, భార్యలు, పిల్లల శోకం సామూహికమై అమరులైపోయిన వారిని తలచడానికి, ఒకరినొకరు ఓదార్చుకోడానికి ఒక సంఘంగా అవతరించిన ఒక గొప్ప రాజకీయ సంస్కృతి. శవాల్ని కూడా మాయంచేసే, దుఃఖాన్ని కూడా నిషేధించే ఫాసిస్టు పాలన నేడు మనం అనుభవిస్తున్నాం. రాజ్యం క్రూరత్వానికి బీభత్సంగా, భయానకంగా, హృదయ విదారకంగా కుమిలిపోయి, కుళ్ళిపోయి పురుగులు పట్టిన బిడ్డల దేహాన్ని తన కళ్ళతో చూడడానికి ఏ తల్లికీ వశంకాదు.

ఎర్రటి పండుగా మొదటిసారి చూసుకున్న తన బిడ్డను, ఆటపాటల, ఉరుకుల పరుగుల ప్రవాహమైన తన బిడ్డను, ఉద్యమాల ఊపిరయిన తన బిడ్డను 'చంపేశాం' నీ బిడ్డ అవునో, కాదో చూసుకో పో' అని పోలీసులు అంటే... (ఈ శోకం ఎందరిది?) తీరా చనిపోయింది తన బిడ్డ కాదని తెలిశాక ఆ తల్లి సంతోషిస్తుందా...? "కడుపు చించుకుని పుట్టిన బిడ్డ ఈడ పీనుగై పడుందన్న సంగతి రెండు రోజులైనా తల్లికి తెల్వకపోవుడు... ఎంత ఘోరం... నాకు కడుపు కోతంటే ఏందో తెలువ జెప్పినవే. నువ్వు నాకు నా కడుపుల పుట్టిన బిడ్డలెక్కనే అనిపిస్తున్నావ్ బిడ్డా" అంటూ నిలువెత్తు శోకమవుతుంది. "ఈళ్ళింట్ల పీనుగెల్ల, ఒకరి బదులు ఇంకోరు పేర్లు జెప్తరా? పాపిస్టోల్లు ఈళ్ళకేం తెల్సు కడుపుకోత బాదెట్లాంటిదో" అంటూ ఆమెశోకం ఆగ్రహమవుతుంది. ఆ దుఃఖం సామూహికమవు తుంది. నూతన సమాజ నిర్మాణం కోసం తల్లిదండ్రులకు ఆత్మీయులకు దూరమైన విప్లవకారులు ఎందరో తల్లులకు దిక్కైతే, వారి రక్తబంధువులు ఒకరికొకరు తోడైతారు. ఉద్యమం వారి మధ్య బంధమవుతుంది (ఇద్దరు తల్లులు).

రాష్ట్ర సరిహద్దుల్లో 'ఎన్‌కౌంటరైన' తన సహచరుని ఆఖరి చూపుకోసం, పోలీసులు మాయం చేసిన ఆ విప్లవకారుని శవం కోసం ఎంతగానో పోరాడిన మహిళను ఏరుదాటడం చేతగాక భర్త బొందజూడలేకపోయిన వృద్ధురాలి దుఃఖాన్ని రెండు వేర్వేరు సందర్భాలను ఒకే మానవీయ కోణంలో అద్భుతంగా ఆవిష్కరించిన 'బొందజూడనైతి' కథ తెలుగు సాహిత్యంలోని గొప్ప కథల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు.

పితృస్వామిక అణచివేతను కుటుంబంలో ఎదిరించడం మొదలు తన వంటి ఎంతో మంది స్త్రీల విముక్తి సమాజ మార్పుతో ముడిపడి ఉన్నదని వ్యవస్థ మార్పుకొరకు విప్లవోద్యమం దాకా విస్తరించిన చైతన్యం నేడు ఉద్యమాల్లో మహిళల స్థానాన్ని సమున్నతంగా నిలబెడుతున్నది. ముఖ్యంగా ఈ రెండు సంవత్సరాల కాలంలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లలో అమరులైన అనేక మంది మహిళలు ఈ ఆదర్శాన్ని చాటుతూనే ఉన్నారు. భర్తతో చిత్రహింసల కాపురాన్ని తెగదెంపులు చేసుకోవడానికే వెనుకాడిన 'ఉదయ' వంటి స్త్రీలు చివరికి ఉద్యమ జీవితాన్ని ఎంచుకొనే క్రమంలో (అనగనగా ఒక అమ్మ) ఆ ఆదర్శాన్ని అంది పుచ్చుకుంటున్నారు. తల్లి ప్రోత్సాహంతో భర్త నుండి విడిపోయిన ఉదయ క్రమంగా ఉద్యమాల పట్ల సానుభూతినీ, అభిమానాన్ని పెంచుకొని స్వయంగా తనే ఉద్యమంలోకి పోతానన్నప్పుడు కూతురి క్షేమం పట్ల ఆందోళన చెందినా కూతురు తన జీవితాన్ని నిర్ణయించుకునే హక్కును కాదనలేకపోతుంది. "నీ ప్రయాణంలో ఎప్పుడన్నా నువ్వలిసిపోతే నీకో అమ్మ ఉన్నదన్న విషయం మాత్రం మర్చిపోవొద్దురా...." అని మాత్రం అనగలుగుతుంది. మిడ్కో కథల్లో ఇటువంటి అద్భుతమైన, చైతన్యపూరితమైన తల్లి పాత్రలు 'విద్రోహపు మనిషి, జోలపాట, కొత్తమలుపు' వంటి చాలా కథల్లో కనిపిస్తాయి.

భర్తను అనుసరిస్తూ ఉద్యమ జీవితంలోకి అడుగుపెట్టిన స్త్రీ తన సహచరుడు లొంగిపోతే తను మాత్రం దృఢంగా నిలబడుతుంది. "అప్పుడు నేను చెబితే విన్నావు. ఇప్పుడు వినవేంది" అని అతనంటే "నువ్వొక మామూలు భర్తవయితే నిన్ను నేను ఇష్టపడేదాన్ని కాదు... నిన్నంత మంచిగా తయారుచేసింది పార్టీ అని అర్థమయిన తర్వాత పార్టీని ఇంకా ఎక్కువ ఇష్టపడ్డాను" అంటుంది (ప్రవాహం).

లొంగిపోయిన విప్లవకారుని మనఃస్థితిని సున్నితంగా ఆవిష్కరించిన 'మెట్లమీద' కథ మీద చాలానే చర్చ జరిగింది. ఆ చర్చలోకి పోలేని పరిధి ఈ వ్యాసానిది. అయితే ఆ చర్చ విప్లవకారుల లొంగుబాటుకి కారణాల దగ్గర్నుంచి, విప్లవ పార్టీలో మహిళల స్థానం వరకు ఎంతో అవసరమైన చర్చకు ఆస్కారమిచ్చినట్టయింది.

ప్రజల మధ్య, ప్రజా జీవితాల నుండి, పోరాటాల నుండి రూపుదిద్దుకున్న ఈ కథలు సంకలనంగా రావలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. ముఖ్యంగా స్త్రీ జీవితంలోని అనేక పార్శ్వాలు, కుటుంబ హింస మొదలుకొని, సాంఘిక జీవనంలో ఎదురయ్యే వివక్ష, అవమానాలతో పోరాడే మహిళల దగ్గర్నుండి వ్యవస్థతోనే పోరాటం చేసే మహిళల వరకు ఆ చైతన్యాన్ని, సంఘర్షణను నిక్షిప్తం చేయడానికి మిడ్కో కథల సంకలనం రావాలని ఆశిస్తూ మంచికథా సాహిత్యాన్ని అందిస్తున్న మిడ్కో గారికి కృతజ్ఞతలు.

***– 'అరుణతార', డిసెంబర్ 2006***

❖❖❖

# మిడ్కో మరణించలేదు...

***– నరేష్ కుమార్ సూఫీ***

**సొం**త దేశం చేతిలో చంపబడింది...??

మీరెవరైనా 'వియ్యుక్క' కథా సంకలనాలు చదివారా? ప్రతి సంపుటంలోనూ కామ్రేడ్ మిడ్కో కథ ఒకటి ఉంటుంది. మిడ్కో అంటే మిణుగురు అని అర్థమట. చీకటిని చిలికిన ఆ మిణుగురు ఇప్పుడు నిస్సత్తువగా నేల రాలింది. కాదు కాదు తనంత తానుగా సృష్టించిన యుద్ధంలో వెలుతురు మిణుకు నేల రాలింది. రక్తపు గాయాలతో ఆమె మన ముందు మళ్ళీ నిలుచుంది.

ఇది ఒక వ్యక్తిని కోల్పోయిన బాధ మాత్రమే కాదు... ఇది ఒక విప్లవకారిణిని, ఒక గొప్ప రచయిత్రిని, ఒక ఉద్యమ స్ఫూర్తిని కోల్పోయిన విషాదం. మిడ్కో జీవితం కలం, కర్రా, కాల్పుల మధ్య సాగిన పోరాట గాథ. ఆమె కథల్లోని ప్రతీ అక్షరం ప్రజల హక్కుల కోసం రాయబడ్డదే.

మొన్ననే హిమాంశు కుమార్ రాసిన వ్యాసాన్ని మరోసారి గుర్తుచేసుకోవాల్సిన అవసరం వుంది. అందులో కొంత భాగాన్ని ఇక్కడ ఉటంకిస్తున్నాను.

"2023 డిసెంబర్‌లో ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి తిరిగి అధికారంలోకి వచ్చింది. ఒక నెల తర్వాత 2024 జనవరి 1 నాడు 6 నెలల ఆదివాసీ శిశువును పోలీసులు కాల్చి చంపారు. ఒక సంవత్సరం లోపు 14 ఏళ్ల బాలికను కాల్చి చంపారు. 16 ఏళ్ల మూగ బాలికపై అత్యాచారం చేసి, ఆ తరువాత కాల్చి చంపారు. ఇప్పటివరకు దాదాపు 400 మంది ఆదివాసులను చంపారు. వీరిలో మహిళలు దాదాపు 140 మంది ఉన్నారు. సరే వీళ్లంతా ప్రభుత్వం ఆరోపిస్తున్నట్టు నక్సలైట్లే అని అంగీకరించే ఆలోచించినా కూడా... 140 మంది మహిళలు తుపాకులు చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎందుకని పోరాటం చేయాల్సి వచ్చింది? ఏ స్త్రీ కూడా కేవలం సరదా కోసం తుపాకీని ఎత్తదు; ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి తన ప్రాణాలను త్యాగం చేయడానికి సిద్ధపడదు కూడా. దీని అర్థం ఆ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు అలా ఉండడం వల్లనే మహిళలు ఆ సమస్యలకు వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టాల్సి వచ్చింది"

ఒక దేశం దాని సొంత పౌరుల ఆస్తినే కొల్లగొట్టటానికి చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకోవటం కోసం

ప్రాణాలు ఇస్తున్న వీళ్లంతా... మీడియా దృష్టిలో, ఇంకొందరి కోణంలో 'దేశద్రోహులుగా' పిలవబడుతున్నారు. లక్షలకోట్ల విలువైన ఖనిజ సంపదలని దోచుకొని విదేశీ కంపెనీలకు అమ్ముకోవటానికి చేస్తున్న దమనకాండలో మరణిస్తున్న వీళ్లంతా చంపబడుతున్నారని తెలిసినా నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్న మీడియా, పౌరులుగా ఏదో ఒకనాటికి మనమంతా పశ్చాత్తాపం చెందక తప్పదు. కానీ ఆనాటికి సహజ వనరులన్నీ కోల్పోయి, లక్షల ఆదివాసులని పణంగా పెట్టిన ఈ నేల ఎందుకూ పనికి రాకుండా పోతుంది. ఇప్పటికైనా మేలుకొమ్మన్న హెచ్చరికగా ఇవాళ మిడ్కో నేల కొరిగింది.

"వాళ్ళు అడవిలో ఎందుకూ? ఇక్కడికి వచ్చి పోరాటం చేయొచ్చుగా" అని సన్నాయి నొక్కుల చచ్చు మేధోవర్గపు మాటలు చెప్పే వాళ్లంతా సాయిబాబా విషయంలో ఏం చేశారు? వీవీ విషయంలో ఏం చేస్తున్నారు? వేలాదిగా కనీసం విచారణకు కూడా నోచుకోని ఆదివాసీ, రాజకీయ ఖైదీల విషయంలో ఎంత చొరవ చూపించారు? స్టాన్ స్వామి, అగ్నివేశ్ లాంటి ఎందరి మరణాలకు వీళ్ళంతా స్పందించారు??

ఇక్కడ దోపిడీ ఉన్నంత వరకూ పోరాటం ఉంటుంది. ఇప్పుడు చేస్తున్న అధికారిక 'హత్య'ల తరవాత మైదాన ప్రాంత ఆలోచనాపరుల మీదా ఈ దాడి జరగనుంది. నట్టనడి నగరంలోనే ఆక్రమణలని అడ్డుకోని వాళ్లం.... అడవిని పట్టించుకుంటామా?

చూస్తూనే ఉంటాం... జోహార్లు చెబుతూనే ఉంటాం... ఏదో ఒకనాడు ఎందుకూ పనికి రాని నిస్సహాయ చావులు చచ్చి కాలంలో కలిసి పోతాం. వాళ్ల బాటలో నడవమని చెప్పటం లేదుగానీ... ఇప్పుడు మన మౌనం కచ్చితంగా ఒక యుద్ధనేరమే అని అంగీకరించండి.

అక్కాలార... అన్నాలార... బిడ్డాలార... కొడుకూలార...

వీరులార మీకు ఎర్రెర దండాలు... పాదాపాదానా పరిపరి దండాలూ...!

❖❖❖

*"చారెడు చెలక కోసం యుద్ధాలు చేస్తున్న ఆదివాసీల ఆకాంక్ష ఆమె..*
*కుల పీడన పోవాలని కళ్ళెర్ర చేస్తున్న దళితుడి పగ ఆమె..*
*స్త్రీలు కోరుకొనే సమానత్వం ఆమె.."*

# రేణుక పర్యాయపదం మిడ్కో

**– పాణి**

**వి**ప్లవోద్యమం స్త్రీలను ఒక విశాలమైన ప్రపంచంలోకి తీసికెళుతుంది. వేల ఏళ్ల సంకెళ్ల నుంచి విముక్తమయ్యేందుకు రెక్కలు తొడుగుతుంది. పితృస్వామ్యమనే అత్యంత హేయమైన బందీఖాన నుంచి సుందరమైన స్వేచ్ఛాతీరంలోకి నడిపిస్తుంది. సొంత ఆస్తి పునాదిగా, లైంగిక శ్రమ విభజన అనే ఇరుకు గోడల మధ్య నిర్మాణమైన కుటుంబం నుంచి ఉత్పత్తిదాయకమైన, సృజనాత్మకమైన వర్గపోరాటంలో భాగం చేస్తుంది. అప్పుడు స్త్రీలు చేయగల అద్భుతాలు ఎట్లా ఉంటాయో, అవెంత సాహసికంగా పదునెక్కుతాయో తెలుసుకోవాలంటే మిడ్కో జీవితంలోకి తొంగి చూస్తే చాలు.

ఆమెలాంటి వేలాది, లక్షలాది నూతన మహిళలను అర్థం చేసుకోడానికి ఆమె నడచిన దారులను గమనిస్తే సరిపోతుంది. రేణుక ఒక మధ్యతరగతి ఉపాధ్యాయుడి కూతురు. ఆమె కుటుంబ వారసత్వం ఏమోగాని, తెలంగాణలోని కడివెండి లాంటి వీరోచిత వర్గపోరాట వారసత్వం ఉన్నది. విప్లవాన్ని ఎన్నెన్ని చెరగుల చూడవచ్చునో, నిర్మించవచ్చునో, ఊహించి నిజం చేయవచ్చునో తాను పుట్టి పెరిగిన కడివెండి ఒడిలో ఆమె నేర్చుకున్నది. ఏది ప్రత్యక్షమో, మరేది పరోక్షమోగాని, 1990ల విప్లవోద్యమ దశలో కేవలం తెలుగు ప్రాంతాల నుంచే వందలాది పట్టణ కార్మికవర్గ, మధ్య తరగతి కుటుంబాల నుంచి అమ్మాయిలు విప్లవోద్యమానికి ఆకర్షితులయ్యారు. ఆనాటికి ఆలోచనా రంగంలో హోరు మీదున్న స్త్రీవాదానికన్నా భిన్నంగా పితృస్వామ్యాన్ని, లైంగిక వివక్షను, కుటుంబ వ్యవస్థను, మొత్తంగా ఈ సామాజిక వ్యవస్థను దాని చారిత్రక క్రమంలో తెలుసుకున్నారు. పితృస్వామ్యాన్ని ఓడించాల్సిన మహిళలకు విప్లవమే ఎందుకు పరిష్కారం కావాలనే వాదనలను అధిగమించి, విప్లవమే పితృస్వామ్యాన్ని మట్టుపెట్టగల అజేయశక్తి అని వాళ్లు గ్రహించారు. ఆచరణాత్మక పితృస్వామ్య వ్యతిరేక భావజాల, సాంస్కృతిక, రాజకీయార్థిక పోరాటాలను విప్లవంలోనే వాళ్లు సమగ్రంగా తెలుసుకున్నారు. అందుకే విప్లవమే ఏకైక పరిష్కారంగా ఎంచుకున్నారు.

అలాంటి వాళ్లలో రేణుక ఒకరు. ఆమె రేణుకగా తెలిసినదానికన్నా మిడ్కోగానే ఎక్కువ మందికి తెలుసు. విప్లవమంటే సకల సృజనాత్మకతల సమాహారం కాబట్టి, నేల మీది నుంచి సమున్నతంగా మానవతను, విముక్తిని ఎత్తిపట్టగల శక్తి కలది కాబట్టి రేణుకను తనకు తగినట్లు అది తీర్చిదిద్దుకున్నది. ఆమె విప్లవానికి ఎన్నెన్ని

రూపాల్లో పని చేసిందో మనకు తెలియదుగాని, ఆమె మిడ్కోగా పరిణమించిన తర్వాత ఆ మిణుగురు పురుగు కాంతి దండకారణ్యం నుంచి తెలుగు సాహిత్య రంగంలోకి కాగడాలా ప్రసరించింది. కథలు చదివే అలవాటున్న వాళ్లెవరూ ఆమె కథల పర్యావరణానికి దూరంగా ఉండలేరు. రేణుకకు దండకారణ్యం ఇచ్చిన పర్యాయపదం 'మిడ్కో' అయినట్లే, మిడ్కో అనే సృజనజీవికి ఎల్లకాలాలకు చెదరని చిరునామా 'మెట్ల మీద'.

కానీ రచయిత్రిగా ఆమె 'మెట్ల మీద'కు చేరుకోడానికి చేసిన ప్రయాణంలో ప్రతి కథా ఆ కథకు సరిసమానమే. ఆమె కథలను ఒకసారి వరస క్రమంలో చదవండి. విప్లవం ముట్టుకొనే స్త్రీల జీవన కోణాలన్నిటినీ ఆమె కథలు చేసింది. విప్లవమెంత ఆర్ద్రంగా, సున్నితంగా, ఉన్నతంగా స్త్రీని అర్థం చేసుకుంటుందో, ఆ క్రమంలో తానెంత విశాలమవుతుందో... మిడ్కో కథలుగా మలిచింది. స్త్రీని గ్రహించలేకపోతే విప్లవానికి మరే అర్హత లేదేమో అన్నంతగా విప్లవోద్యమం స్త్రీల కోసం, స్త్రీల చుట్టూ తిరుగుతోంది. రచయిత్రిగా రేణుక దృక్పథం ఇదే. విప్లవంలోని స్త్రీ గురించి సరే, సాధారణ మహిళల్లోని మాతృత్వం, సహచర్యం, ప్రేమ, బాల్యం వంటి భావనల చుట్టూ రేణుక రాసిన కథలు మరే స్త్రీ రచయితలు రాయగలిగేవి కావు. స్త్రీ జీవితంలోని విషాదాన్ని, దుఃఖాన్ని, విధ్వంసాన్ని మాత్రమే కాదు, స్త్రీల ఔన్నత్యాన్ని, సామర్థ్యాన్ని, సృజనాత్మకతను విప్లవోద్యమం గ్రహించిన తీరునంతా, తీర్చిదిద్దిన క్రమాన్నంతా రేణుక కథలుగా రాసింది.

ఒక్క మాటలో చెప్పాలంటే విప్లవానికి-స్త్రీకి ఉండే సంబంధమే ఆమె కథా వస్తువు. కావాలంటే ఇప్పుడు ప్రతి కథా ఇతివృత్తాన్ని లోతుగా చూడవచ్చు. మైదాన ప్రాంతపు విద్యావంత కుటుంబాల్లోని, గ్రామీణ ఇండ్లలోని ఏ మహిళ జీవితానుభవాన్నయినా అక్కడంతా ఆవరించి ఉండగల విప్లవోద్యమ రూపాల్లోంచి ఆమె కథలు ఎన్నుకున్నది. స్త్రీల చుట్టూ ఉండే అనేకానేక సంప్రదాయ, బూర్జువా సౌందర్య భావనలకు భిన్నంగా వాళ్ల జీవిత సంఘర్షణే, వాళ్లు పొందే ఎరుకే, వాళ్లు ఎంచుకొనే ఆచరణే, వాళ్లలోని పరమ సౌందర్యమని పాఠకులకు అనిపిస్తుంది. మిడ్కో కథల్లోని ఆకర్షణ అంతా ఇదే. స్త్రీల జీవితంలోని అలవిగాని దుఃఖాన్ని, అంతులేని ప్రేమను, తిరుగులేని సాహసాన్ని, అసాధారణ త్యాగాన్ని రేణుక విప్లవంలోంచి చూసింది. అందువల్ల లక్షలాది తెలుగు కథల్లో, వేలాది తెలుగు నవలల్లో కనిపించని అద్భుతమైన స్త్రీ ఆమె కథల్లో కనిపిస్తుంది.

సున్నితంగా ఉండటమంటే దృఢంగా ఆలోచించడం, ఆచరించడం అనే అర్థాలను ఆమె స్త్రీ పాత్రలు పదే పదే చెబుతుంటాయి. మామూలుగా అయితే ఇదొక వైరుధ్యమనిపిస్తుంది, పొసగని వ్యవహారం అనిపిస్తుంది. కానీ అదే ఉండగల వాస్తవం. ఆమె తొలి రోజుల్లో ప్రధానంగా మధ్య తరగతి కుటుంబ స్త్రీల గురించి రాసిన కథల్లోనూ, దండకారణ్యం వెళ్లాక రాసిన విప్లవ ప్రభావంలోని ఆదివాసీ మహిళల గురించి రాసిన కథల్లోనూ మనకు కనిపించే సున్నితత్వం అదే. మనుషులు ఇంత సున్నితంగా ఉంటారా? ఉండాలా? అనిపించిన ప్రతిసారీ ఇంత దృఢంగా ఉండగలరన్నమాట..! అనిపిస్తుంది.

మిడ్కో కథల్లోని స్త్రీపాత్రల గాంభీర్య ప్రవర్తన, సున్నితమైన అవలోకన మనకు చాలా గొప్పగా అనిపిస్తాయి – అచ్చంగా రేణుకలాగే. ఆమెను ఎరిగినవాళ్లు ఎన్నడైనా ఆమె గడిబిడిగా మాట్లాడం చూసి ఉండరు. మాటలో, పనిలో, పలుకులో, వ్యవహారంలో సున్నితంగా ఉండటం ఆమె సహజ లక్షణమో, విప్లవ లక్షణమోగాని ఆమె కథలన్నీ అలాంటి సున్నితమైన చూపు వల్లనే కళాత్మకతను సంతరించుకున్నాయి. తీవ్రమైన దుఃఖం సహితం జీవితంలోని సహజమైన విషయంగా భావిస్తుంది కాబట్టి ఆమె పాత్రలు ఎక్కడా కృతకంగా ఉండవు. విలువలను

సంతరించుకొనే మానవ వ్యక్తిత్వం ఎంత సహజంగా, నేల మీద నింపాదిగా ఉంటుందో రేణుక కథల్లో చూడవచ్చు.

విప్లవం గురించి రాసిన మిడ్కో కథల్లో ఎందరో సాహసవంతులైన పురుషులు, పిల్లలు, వెరసి ప్రజలు.. కామ్రేడ్స్ కనిపిస్తారు. వీళ్లందరి వ్యక్తిత్వాలు సహితం స్త్రీ పాత్రల పరస్పర ప్రభావాల్లో, సంఘర్షణల్లో రూపుదాల్చుతాయి. అందుకే విప్లవం గురించి రాయడమంటే స్త్రీల గురించి రాయడమనే తార్కిక సత్యం ఆమె కథల నిండా పరుచుకొని ఉంటుంది. మిడ్కో తొలి కథల్లోనే ఈ గ్రహింపు వుందని కూడా రుజువు చేయవచ్చు. విప్లవానికి ఆవల స్వీయాత్మక దృష్టితో, ఉదారవైఖరితో, వుత్తుత్తి మానవతావాదంతో ఆమె స్త్రీల జీవితాన్ని ఎన్నడూ చూడలేదని కూడా ఒక్కో కథను తీసుకొని విశ్లేషించవచ్చు. అట్లాగే స్త్రీ అనుభవం స్త్రీలదే, దానికదే ప్రత్యేకం, దాన్ని రాయడమే సాహిత్య పరమ లక్ష్యం... అని కూడా ఆమె ఒక్క కథ రాయలేదు. స్త్రీ అనుభవం... అది నగరమైనా, పల్లెలైనా, అటవీ ప్రాంతమైనా ఈ మొత్తం వ్యవస్థలో భాగం అనే మౌలిక భావన ఆమెకు మొదటి నుంచీ ఉన్నది. అందుకే ఆమె చూపే స్త్రీ అనుభవం మొత్తంగా మానవ అనుభవం అనిపిస్తుంది. అందువల్లనే అది విప్లవానికి వనరుగా మారింది. రేణుక ఆదివాసుల అడవుల్లోని మిణుగురు పువ్వేగాక మనందరి జీవితాల్లోని వెలుగు పువ్వు అయింది. ఆ కాంతిరేఖ ఆమె భౌతికకాయంతో మలిగిపోయేది కాదు. మనుషులు తమను తాము విముక్తం చేసుకొని, ఈ సమాజాన్ని సుందరంగా తీర్చిదిద్దే రోజు దాకా తోడుగా ఉంటుంది.

***– 'వసంత మేఘం' ఆన్‌లైన్ పక్షపత్రిక, 1 ఏప్రిల్ 2025***



*ఉద్యమ జీవితంలో రేణుక*

# మిడ్కో!

*– బజరా*

“మన రాజ్యం చీకటితో యెంత బావుందో కదా?!”

“ఔను, కాని అదేమిటి యింత చీకటిలోనూ మచ్చలా ఆ వెలుగు?”

“నిజమే, అది ఆ స్పార్క్... గ్లీమ్... నిప్పుకణమయితే కాదు కదా?”

“కాదు, కాదు, మిడుగయ్యుంటుంది!”

“మిడుగేమిటి పిడుగులాగ?!”

“మిణుగురు!”

“ఓహ్ మిణుగురు పురుగేగా? దానికేం నిప్పుంటుందీ అంటుకోవడానికి?”

“భలేవాడివే, వొక్క మిణుగురు వేవేల లక్షల మిణుగురుల్ని పోగేస్తుంది!”

“అప్పుడది అగ్నికంటే ప్రమాదకరం!”

“అలా అయితే మన రాజ్యం తగలబడిపోయినట్టే...?!”

“అడవికి మిణుగురులే వెలుగని ప్రజలు అనుకుంటారు!”

“దిక్కుమాలిన ప్రజలసంగతి అటుంచు, అడవి కడుపులో దాగిన అన్నవస్త్రాల ధారాదత్తం బయటపడితే?”

“వీల్లేదు, మన బలగాలు యేమి చేస్తున్నాయ్?”

“ఆ పని మీదే వున్నాయ్!”

ధన్... ధన్... ధన్...

మిణుగురొకటి నేలరాలింది!!

***– ‘వసంతమేఘం’, 2 ఏప్రిల్ 2025***

# A Revolutionary Flame Extinguished, But the Fire Lives On..

***- Untilted Proletarian Art***

On March 31, the Indian state once again showed its brutal face, murdering a courageous daughter of the soil - Comrade Renuka - in the forests of Chhattisgarh's Dantewada district. Known by many names - Renuka, Chaite, Saraswati - but remembered as one unwavering revolutionary, her real name was Gumudavelli Renuka, born in the historic village of Kadavendi, Warangal. This was no ordinary village - it was once a fortress of rebellion during the 1946 Telangana movement, and Comrade Renuka carried that legacy in her blood.

She wasn't born with a gun in her hand. She studied law at Tirupati Padmavati Mahila University and briefly served as a lawyer. But her conscience didn't allow her to stay silent in the face of state oppression. In 1996, she chose the path of revolution, leaving behind the comfort of courtrooms to walk among the oppressed, organize, educate, and fight.

For nearly three decades, she served the people through the Maoist movement, editing revolutionary journals like Prabhat, Mahila Margam, People's March, and Bhumakal Sandesh. Her words ignited minds; her actions shook the foundations of corporate loot and state violence. The state, afraid of her influence, announced a bounty of [1] 45 lakh on her head. But no amount of money could buy the loyalty of the people she served.

And now, the state that fears voices like hers boasts of a "successful


encounter." They flaunt the seizure of a laptop and an INSAS rifle as trophies, while hiding the truth - that they are waging war on the indigenous people to loot the mineral-rich lands of Dandakaranya, estimated to be worth several lakh crore rupees.

Since the BJP's return to power in Chhattisgarh in December 2023, a full-scale war—Operation Kagar - has been unleashed. Under the guise of "clearing Maoists," over 400 Adivasis, including 140 women, have been martyred. But the soil of Dandakaranya drinks this blood and turns it into resistance.

Comrade Renuka may have fallen, but her ideals cannot be killed. Her blood will water the revolution. Her legacy will live in every oppressed Adivasi who takes up the flag of resistance.

Red salute to Comrade Renuka-your martyrdom strengthens our resolve! The struggle continues!

Long Live The Revolution!



# A Rebel's Journey: Gumudavelli Renuka's Life and Death in the Maoist Movement

***- Sukanya Shantha***

**R**enuka was killed in police firing in Bijapur district of South Chhattisgarh on March 31. The Dantewada police claimed she died in an "encounter" – a claim consistently made in all such killings, raising doubts about its veracity.

Mumbai: In the 1980s, it was not uncommon for the youth of Kadavendi village in Warangal district, Andhra Pradesh to abruptly drop out of school and college and vanish overnight to join armed struggles. Every household had a story to tell.

The second phase of the Telangana struggle, which reignited in the early 1980s, was at its peak, and Kadavendi had become a hotbed for both separate Telangana and Maoist movements. But that was not the path that Gumudavelli Renuka chose for herself. Renuka was barely in college when her parents decided to marry her off –possibly out of fear that she, like her brother G.V.K. Prasad, might turn to armed struggle.

The marriage failed soon after. Renuka, who had endured her husband's constant violence for some time, eventually walked out. "This was the first time she questioned patriarchy," shares Prasad, now a surrendered Maoist and a journalist at a Telugu channel.

Renuka was killed in police firing in Bijapur district of South Chhattisgarh

on March 31. The Dantewada police, who led the operation, claimed she died in an "encounter" – a claim consistently made in all such killings, raising doubts about its veracity. Fifty-four-year-old Renuka, who spent nearly three decades in the Naxal movement as both an overground worker and an underground guerrilla, was also a "great short story writer" and a "splendid journalist," Prasad recalls. When she died, Renuka was the Dandakarya Special Zonal Committee member and carried a prize money of Rs 45 lakh-Rs 25 lakh announced by the Chhattisgarh state government and Rs 20 lakh by the Telangana government.

The Gumudavellis come from Padmashali, or weavers' community, classified as a Backward community in both Telangana and Andhra Pradesh. A mixed-caste village, Kadavendi mostly had landless families or families with meagre landholdings. "Even the Reddys (usually a landed community) in the village were mostly landless," Prasad says.

Prasad joined the movement in the mid-1980s while still in school. Renuka, two years his junior, showed no such inclination at the time. "But after her marriage failed, she began questioning familial structures. She once wrote me a long letter asking how Marxists viewed patriarchy and addressed the daily struggles of women within patriarchal systems. I could see a churning had begun within her," he told The Wire. The broken marriage, in a way, set her free, he says. She soon travelled to a distant district of Chittoor to pursue law.

While still a law student, Renuka became a part of a women's group, Mahila Shakti, a group working on issues like dowry deaths and sanitation. Soon she started writing for the revolutionary monthly magazine Mahila Margam. On completion of her law education, she moved to Visakhapatnam, where she worked as a lawyer. By 1996, Renuka had already begun working as an overground Naxal leader, writing short stories, organising meetings, and providing legal support for families of those underground.

Renuka took up several pen names. In early 2003, when her younger brother, along with their parents, were on their way to meet Prasad, a fugitive then, in the forest, the police had apprehended them and tortured the brother. Renuka used

her legal education to fight for his release from illegal detention. In that incident, a young girl named Damayanti was killed in police firing, and soon Renuka began writing under the name B.D. Damayanti. “Most of her journalistic work (published in the party mouthpiece) was under this byline,” Prasad says. Among some of her best writing works, Prasad says, is the one she wrote on the violence unleashed on the Adivasis of Bastar by the state-sponsored militia group Salwa Judum. She also wrote about land displacement and the depleting resources of the tribal communities.

She also used the name Midko, a Gondi word for fireflies, to write her short stories. Later, in the party, she was also known as Bhanu or Chaite.

In late 2003, her younger brother was arrested as a part of the widespread arrests that followed in the state in the aftermath of a bid to “assassinate” the then chief minister of Andhra Pradesh, N. Chandrababu Naidu. He was tortured in the custody but was eventually acquitted of all charges. While the brother went on to become a lawyer and worked with different human rights organisations in the region, Renuka decided to go underground. In 2004, she had joined the guerrilla movement.

A small-framed woman, she soon took up arms training. According to Prasad, while both of them were underground they seldom met. “We were a part of different units and also moved in very different regions,” he recalls.

Having joined the movement, Renuka’s quest for love persisted. Around 1997, while she was still overground, a senior party leader separately suggested it to both Renuka and Santosh Reddy, the then party’s Andhra Pradesh state committee secretary as well as a central committee member, to consider marriage. Although from the same Kadavendi village, Reddy had moved out to join the movement many years ago. They barely knew each other. On one occasion, sometime in 1997, Renuka went into the jungles of Nallamala in Andhra Pradesh to meet Reddy and seek his suggestions in dealing with the problems the party was facing in its Tirupati unit. They soon fell in love.

Since Reddy was a senior party leader and Renuka was still an overground

worker, they had to keep their marriage secret. On December 2, 1999, Reddy was killed in a police firing. "Renuka couldn't even openly claim the marriage or just cry her heart out. Her love life always had a tragic ending. She truly loved Santosh," Prasad says.

In 2005, Renuka remarried another party commander, and he too was killed in police firing in 2010. Contrary to the popular notion, Prasad says Renuka's entry into the armed movement didn't happen because of him. He attributes it to many things – from the political atmosphere in the region to Renuka's slowly developing critical faculty. "She was her own person, who was deeply disturbed by things happening around her and would question," he recalls.

When the news of Renuka's death broke and he was informed by a local superintendent of police in Telangana, Prasad was at work. He says the news of her killing shook him, but he knew that is how her life would end.

"Every morning, my wife [who also surrendered along with Prasad in 2014] would scan through all newspapers and channels to see if any new killing had taken place in the [Bastar] region. My mother in Hyderabad would do the same. In the past year, the government has brutally killed hundreds in the name of combatting the Maoist movement. There has been no dialogue, simply cold-blooded murder," he says.

Prasad travelled to Dantewada to receive Renuka's body, which the cops had wrapped in a polythene bag and kept for display. "Until this moment, I had assumed that Renuka was killed along with other comrades." Just a day before, 17 Naxals were killed in the neighbouring Sukma district. That is when, Prasad says, he got suspicious.

"Renuka, who never wore any earrings or bindi, was seen wearing them suddenly. This could only mean she was moving around in a village and had lived a regular life in a village here. Then why did the police not simply capture her," he asks.

The police have claimed that Renuka was killed in a "fire exchange" on the "Dantewada-Bijapur border" along the banks of the Indravati river. Her hands, the

family say, were mutilated, suggesting either torture in the hands of the police force or an intentional tactic to erase any forensic evidence after killing her.

A cache of ammunition was shown, allegedly found with her. The police allowed a post-mortem to be conducted on her body, but the report was not made available to the family.

On April 2, the Dandakaranya Special Zonal Committee of the banned CPI (Maoist) organisation issued a press note, in which they have claimed that Renuka was captured from a small house in Belnar village in Bhairamgadh block of Bijapur district. Here, the press note says, Renuka had been living since she was not keeping well.

"The police gheraoed her house around 4 am on March 31. Around 9-10 am, they took Chaite (a name by which she was known in the banned party) towards Indravati river and killed her," the Maoists have claimed in the press note. With over 400 killings in the region, which include both from the armed movement and several civilians, the banned Maoist organisation, in the press note, has conveyed that they want to have a dialogue with the government.

When Prasad and his wife took Renuka's body back to their native Kadavendi, thousands of people from across the region had gathered. She was given a martyr's farewell, Prasad says.

❖❖❖

# Gummadivelli Renuka: Maoist, writer, feminist, and rebel

***- Ashutosh Sharma***

She was killed on March 31 in a reported encounter with Chhattisgarh's DRG forces. Civil society groups allege it was an execution.

On March 31, a hail of bullets silenced Gummadivelli Renuka, alias Chaite, 55, an insurgent whose pen was as mighty as the rifle she carried in the dense forests of Bastar, Chhattisgarh.

She was killed by the District Reserve Guard (DRG), a specialised police unit formed in 2008, to fight Maoist insurgents; and her death has raised some serious questions. Renuka, who had a combined reward of Rs.45 lakh from the Chhattisgarh and Telangana police, was among approximately 150 women Maoist rebels killed in the region over the past year. Rights activists allege her death was a result of the government's "surrender or be eliminated" policy, aligned with the Central government's declared objective to eradicate Naxalism by March 2026.

Renuka represented many things to many people: a fearless author, a leader of a women's liberation movement. But to the state, she will always remain a terrorist, her killing an elimination of a threat.

The police claimed Renuka was killed during an exchange of fire at 9 am in the forested hills spanning Nelgoda, Ikeli, and Belnar villages, near the border of Dantewada and Bijapur districts in Chhattisgarh where DRG personnel were out

on an anti-Naxal operation. After two hours of gunfight, her body was reportedly recovered from the site along with an INSAS rifle, ammunition, a laptop, and Maoist literature, the police said. There were no police casualties during the alleged exchange of fire.

But the Communist Party of India (Maoist) has called the encounter a staged execution. In a press statement, the party alleged, "Comrade Chaite had gone to Belnar village in the Bhairamgarh block, where she was staying alone in a house because she was unwell. Acting on a tip-off, the police laid a cordon around the house at 4 am on March 31 and arrested her. CID officials from Chhattisgarh and the Telangana police interrogated her for at least 2–3 hours. Between 9 and 10 am, she was taken to the Indravati River, where she was killed in cold blood." A publication, Andhra Jyothi reported allegations that she was tortured to death.

## A law degree and press in-charge

A resident of Telangana, Renuka held a law degree and played a key role in Chaitanya Mahila Sangham, a women's rights organisation operating in Telangana and Andhra Pradesh since 1995. She later joined the Maoist movement, and in 2004, went underground.

Renuka served as the press and publication in-charge of the Dandakaranya Special Zonal Committee, a key operational unit of the banned CPI(M). She oversaw activities in the Dandakaranya region, a sprawling forest that extended through Chhattisgarh, Maharashtra, Odisha, Telangana and Andhra Pradesh.

She is believed to have authored over 30 short stories, using multiple pen names, portraying strong female characters; some of these stories were translated into English and published in Viyyukka— The Morning Star, a collection of stories of Maoist women insurgents. She was known as Midko among Telugu readers.

Renuka is said to have authored articles and a book on people's participation in the Narayanpatna struggle of 2000. Tribal communities in Narayanpatna, in Odisha's Koraput district, have for long been facing dispossession of their land by non-tribal landlords despite legal protections under the Fifth Schedule and Odisha's

land laws. The government's failure to restore these lands has left impoverished tribals trapped in bonded labour.

Under the name B.D. Damayanti, she is said to have documented the violence perpetrated by Salwa Judum, a state-backed militia which was declared unconstitutional and banned by the Supreme Court in 2011.

For her, politics and personal life were deeply intertwined. She married Santosh Reddy, also known as Mahesh, a central committee member of the party, who she had known since childhood. After his death in a police encounter in 1999 in Telangana's Karimnagar district, she later married Shakamuri Appa Rao, alias Ravi, who reportedly met a similar fate in a police encounter in Telangana's Warangal district in 2010. Her brother, Gumudavelli Venkatakrishna Prasad, known as Gudsa Usendi, surrendered to authorities in 2014.

She was tasked by the party with editing and publishing several clandestine magazines, including Awami Jung, People's March, Jhankar, Mahila Margam, Sangharshkar Mahila, Pituri, Midangur, Bhumkal Sandesh, and Prabhat.

"Boycott fake Lok Sabha and Assembly elections" screamed a lead headline of a page one articlein the Hindi quarterly magazine Prabhat last year, rallying support for the insurgency. Its deck read, "Oppose INDIA bloc including Congress, which is responsible for enforcing the economic policies of liberalization, privatization and globalization."

Referring to an Oxfam study, another article in the journal, titled "Modi's Ten Years—An era of fear, repression, and corporate loot" pointed to a sharp rise in the economic inequalities in past decade.

In the 38-page edition, another article titled "Raise Your Voice Against Operation Kagar—A Counter-Revolutionary Surajkund Strategy", discussed Operation Kagar, a joint counter-insurgency initiative launched in January 2024 by the Central and Chhattisgarh State governments to eradicate left-wing extremism. Initiated after the BJP came to power in Chhattisgarh, political observers linked the operation to the "Chintan Shivir" of State Home Ministers, held in Haryana's

Surajkund in October 2022. The two-day event was a brainstorming session aimed at strengthening internal security, enhancing coordination among States and promoting cooperative federalism in law and order matters.

Addressing the conference via video, Prime Minister Narendra Modi emphasised the “Panch Pran” (five resolves) to build a developed India by 2047. On Naxalism, Modi stated: “Every form of Naxalism, whether through guns or pens, must be uprooted to prevent the youth from being misled.”

On April 3, Renuka’s funeral was held in her native village, Kadavendi in Telangana’s Jangaon district. Her body, draped in red and carried atop a tractor trolley adorned with flowers and CPI(M) flags, moved through the village as slogans rang through the air - there were voices of grief, declarations of resistance, tributes to her legacy, and a resolve to fight class inequality.

Villagers turned out in huge numbers for the solemn funeral procession. They were joined by civil society members, activists, writers, student leaders, former Maoists and even leaders from several mainstream political parties.

*- Published : Apr 05, 2025*

*“మనుషులమీద ఇంత ప్రేమెలా పుడుతుంది?*
*ఏం చదువుకుంటే అంత ప్రేమ వొస్తది?*
*ఏ జ్ఞానం సముపార్జిస్తే వొస్తది?*
*ఏమ్మా, ఇట్లా నవ్వడం మాకెప్పుడొస్తది?*
*నీలా చనిపోవడం ఎట్లా నేర్చుకునేది?”*

# ఆమె వెలుగు భూగోళమయ్యింది

- వద్దెబోయిన శ్రీనివాస్

ఇప్పుడు
ఈ నేలా
ఆమె కథ వింటోంది

తన కాళ్ళూ చేతులూ
తన మనసు మాట
తన ఆలోచన ఆచరణ
తరతరాల సంకెళ్ళ విడిపించుకోడానికి
పితృస్వామిక గోడలు పగలగొట్టింది

తన నవ్వుల్ని
తన ఏడ్పుల్ని
మనసార కుమ్మరించి
బతుకు కుదుటపడే పాటందుకుంది
అర్ధరాత్రి స్వాతంత్ర్యపు
అర్ధ భాగ చీకట్ల
అసాధ్య వెలుగుల కడగాలని
స్వేచ్ఛా స్వాతంత్ర్య ప్రకృతిలోకి
రెక్కలు తొడుక్కుని

జీవితానికి సీతాకోకచిలుక రంగులద్దింది

భారత స్త్రీ బానిస రంగు తూడ్చి
కడవెండి వారసత్వం అద్ది
ముట్టుకోవాల్సిన విప్లవాన్ని పరిచింది

తన చూపు నిండా
స్త్రీ విముక్త పుప్పొడి వెదజల్లుతూ
మనుషుల నిండా నిండింది!

❖❖❖



# మనుషుల మీద ఇంత ప్రేమెలా పుడుతుంది?

*- సిద్ధార్థి సుభాష్ చంద్రబోస్*

ఇల్లూ వాకిలీ, కన్నవాళ్ళు, పేరూ వూరూ చివరికి ప్రాణాలూ..

ఎన్నడూ మొహం చూడని అడవి మనుషుల కోసం ఎలా ఎలా ఫణంగా పెట్టాలనిపిస్తది?

చచ్చేటప్పుడు చిత్రహింసలు పడి చావాల్సి వస్తుందని, ఆ చావు ఎప్పుడొస్తుందో తెలియదని తెలిసీ ఎలా ఎలా బ్రతికే ధైర్యం వస్తుంది?

చనిపోయేలోగా నచ్చిన తిండి తినాలని, నచ్చిన దుస్తులేసుకోవాలని, నచ్చిన మనిషితో బ్రతకాలని అనిపించదా?

ఇవన్నీ త్యాగం చేసేది మనకుటుంబం, మనకులం, మనమతం కాని మనుషుల మీద ప్రేమ కోసమా?

ఏం చదువుకుంటే అంత ప్రేమ వొస్తది?

ఏ జ్ఞానం సముపార్జిస్తే వొస్తది?

ఏమ్మా, ఇట్లా నవ్వడం మాకెప్పుడొస్తది?

నీలా చనిపోవడం ఎట్లా నేర్చుకునేది?

❖❖❖

# అమరత్వం

- శాఖమూరి రవి

ఆమె అమరత్వం
ఆవలిలో నాటిన
విత్తనాల లాంటివి
మట్టిపొరల్ని చీల్చుకొని
మహావృక్షాలుగా ఎదిగి వస్తాయి
ఆమె అమరత్వం
ఆకులో దాగిన
పత్రహరితం లాంటిది
సూర్యోదయ కిరణాల తాకిడితో
అమాంతం ప్రాణవాయువును
పుట్టిస్తుంది
ఆమె అమరత్వం
ఆకాశంలో చుక్కల వంటిది
చీకటిని చీల్చి
వెలుగును ప్రసరింపజేస్తుంది

❖❖❖

# మిడ్కోకు మరణమే లేదు

**– ఏబూసి**

శిశిర నిశి రాత్రి మిడ్కో వెలుతురును చిమ్మింది
వసంత కాలం మొదలయ్యే వేళ
ఒక మిడ్కో నేల రాలింది...
మిడ్కోకు మరణం లేదు
మిడ్కో అంటే చీకటిలో వెలుగును విరజిమ్మె
మిణుగురు ప్రాణి

బడుగు జీవుల బతుకులోని
చీకట్లను తొలగించడానికి
రేణుక మిడ్కోగా మెరిసింది
మరో వసంత మేఘ గర్జనయ్యింది
న్యాయశాస్త్రం చదివి నగ్జల్బరియే
నా అసలైన మార్గమన్నదీ
ఇంద్రావతి ఒడ్డున పారిన
నీ నెత్తుటి ధార...
జోహార్ అంటూ
నది కన్నీరై ప్రవహించింది

నీ దారుణ హత్యతో దగాపడ్డ దంతేవాడ జనమంతా

జంగ్ సైరనై మోగిండ్లు
నువ్ లేవని తెలుసుకొని
తెలుగు నేల గుండెలన్ని తల్లడిల్లి పోయాయి

కడివెండి చారిత్రక ఎర్ర దారిలోనే
ఎర్రంరెడ్డి తొవ్వను ఎరుపెక్కించి
అప్పారావు అడుగుజాడలో అరుణ పతాక
ఎత్తి పట్టినవ్
దూల దాదతో నువ్ కలిసి  దండకారణ్యాన్ని కదిలించావు
చైతేగా విప్లవంలో చేగువేరను మరిపించావు
త్యాగాల శిఖరంపై చెరిగిపోని రేణుకవు !

❖❖❖



# కడివెండి-తరాలపల్లె

– సూర్యచంద్ర

నెత్తురు ప్రవిస్తున్న వసంతమిది
దుఃఖంలో కళ్ళు,కలతలో నిద్దుర
తప్పిపోయిన అంధకారం.

"మిణుగురు" రెక్కల్ని విరిస్తే
రాజుకున్న వెలుగు ఆరిపోతుందా?
అస్తమయ పొద్దుమీద
మరింత ఎర్రగా పాకింది
ఉదయాన్ని వెంటబెట్టుకున్న చీకటిది.

"కథ"ను సమాధి చేశారు
కానీ జీవితాలు మేల్కొన్నాయి.

ఒక నవ్వుని చిదిమితే ఏమయ్యింది?
శత్రువు గుండెపై జేవురించిన జెండాలా విచ్చుకున్నది.

వాళ్ళు నేలలోకి జారినట్టే
పత్రహరితమై కాలాన్ని వెలిగిస్తారు
పీడిత జన శోకాన్ని దాచుకున్న
ప్రస్థానమిది.

జ్ఞానానికీ ఆయుధానికీ వారధి
కడివెండి.
చనుబాల కుతికీ విముక్తికీ
కుదిరిన గురి తరాలపల్లి.

❖❖❖



# యవ్వనం - విప్లవం - స్వప్నం

- మట్టి మనిషి

మిణుగురు పువ్వు
ఆ దారిన వస్తూ
ఆ పేరు పెట్టుకున్నప్పుడే
తెలిసిపోయింది
ఎప్పుడో ఇలా రాలిపోయి
వేగుచుక్కవై వెలుగొంది
వెలుగులు పంచుతావని!

❖

నిస్సహాయంగా వున్న నిన్ను
నిర్దాక్షిణ్యంగా చంపిన వాళ్లకు తెలియదు
చావుదేముంది?
ఎవరికైనా వస్తుంది
ఎప్పుడైనా వస్తుంది
ఎలాగైనా వస్తుంది
పుట్టుకతో చావును
వెంట తెచ్చుకున్న ప్రాణులం
చావుకు అమరత్వం
అద్దుకోవడమే మనిషత్వం
మహా మానవీయత్వం
అల్లూరిని చంపిన,

నిన్ను చంపిన పాలకులది ఒక్క దేహమే
నిన్నటి అల్లూరి ఇవ్వాళ్టి వాళ్లకు దేశభక్తుడు
రేపు నువ్వు కూడా అంతే !

❖

బక్క చిక్కి
శత్రు చేత చిక్కిన నువ్వు
చివరి బుల్లెట్‌తో
ఆగిన నీ గుండె పంపిన నవ్వు
మిణుగురు పువ్వై
దండ'కారుణ్యం' నింపుతుంది
మనుషులకేముంది
పందుల్లా పది మందిని
కనమని చెప్పడానికి
సందుకో నాయకుడున్నాడు
మరి అడవికి..?

❖

దయగల
త్యాగల తల్లులు – తండ్రులు
అప్పుడు ఇప్పుడు ఎప్పుడు
మీకు
చెప్పేమాట ఒక్కటే
మీరు సల్లంగుండాలి
మీరు సల్లంగుంటే
అడవి పచ్చగుంటది
అడవి పచ్చగుంటే
మేము వెచ్చంగుంటాం!

❖

మన్ను–మిన్ను
మనం పరుచుకున్న పరిచయాలు

నిన్ను నన్ను కలిపిన
గుంటూరు మహిళా ముచ్చట్లు
ఢిల్లీ – జాతుల లొల్లి..
మనం కలుసుకున్న సమయాలు...
సంతోషన్న పుట్టిన చోటే పుట్టి
అక్కడే పెరిగి అక్కడి చితి చెంతనే
ఆహుతైన వియ్యుక్క విప్లవ యల్లమ్మ తల్లి రేణుకకు
కలల వెండి మిడ్కోకు 'కడ'వెండి వీడ్కోలు !

❖❖❖

*"అత్యాచారం అంటే ఏంటమ్మా? అదొక అవమానం, హింస. అలా అయితే నేను పెళ్ళయినప్పటి నుంచీ ఈ అవమానాన్నీ హింసనూ భరిస్తున్నా. ఎవడో ముక్కూ మొహం తెలియనివాడు నాకు క్లోరోఫాం ఇచ్చి నన్నేదో చేసాడని మీరంతా బాధపడుతున్నారు. కానీ నా మెడలో తాళికట్టిన హక్కుతో ఇతనెన్నిసార్లో అదే అవమానానికి, అదే హింసకు గురిచేస్తే మీరెందుకు పట్టించుకోలేదు?*

*నాకైతే ఎవడో నాకేమాత్రం సంబంధం లేనివాడు నన్ను పెట్టిన బాధకంటే, నన్ను అర్థం చేసుకోవాల్సినవాడూ, నా మనసును పట్టించుకోవాల్సినవాడూ, నా జీవితంలో సగభాగం కావాల్సినవాడూ పెట్టిన బాధే ఎక్కువనిపిస్తోంది.*

*– రేణుక రాసిన 'ఆమె వ్యక్తిత్వం' కథలో...*

# వెంటాడే నవ్వు

– మెర్సీ మార్గరేట్

ఎందుకు ఈమె నవ్వు ఇంతలా వెంటాడుతుంది?
ఎప్పటికీ మురికిపడని గగనంలా
మన చీకటిని ఎండగట్టే వెన్నెలనా?
మెరుపులా
ముసిరిన మట్టి కళ్లలో,
కదిలిన కలల జాడలలో,
అడవిలో వెలిగే గాయాల మధ్య
ఆమె నవ్వు ఇంకా ఉందా?
ఆకులు చిగుర్ల మాట వినిపించే అడవికి
రక్తం వాసన నేర్పిన తుపాకీ,
ఆమె పేరును కూడా ఇనాముకు పెట్టాయా?
ఆమె కళ్ళలో నిలిచిన వెలుతురుని
బంధించలేకపోయిన తుపాకీ
ఆత్మహత్య చేసుకోలేదా?
వెలుతురును చంపగలరా?
ఒక్క నవ్వును శాశ్వతంగా మింగగలరా?
ఆమె ఇంకా మనలోనే ఉందనీ
అడవిలోని ప్రతి రేణువు ఆమె నవ్వును పుప్పొడి చేసి
వెదజల్లుతుంది చూడు
ఆమె నవ్వు ఇంకా బతికే ఉంది
ఆమె నవ్వు ప్రశ్నిస్తూనే ఉంటుంది చూడు !

# అణువణువునా రేణుక

– ఎన్.వేణుగోపాల్

ప్రతి బాష్పకణంలో రేణుక. ప్రతి నయనంలో రగిలిన ఆగ్రహంలో రేణుక. ప్రతి హృదయంలో సగర్వంగా ఉప్పొంగిన రేణుక. ప్రతి హృదయంలో ఉద్వేగంగా ఎగసిన కసిలో రేణుక.

వేలాది మందిలో ప్రతి మనిషిలో రేణుక. అక్కడ మట్టిలో గాలిలో నీటిలో అణువణువునా రేణుక. చిట్టమ్మ చాలా మందికి పరిచయమే లేదు. మిడ్కో కథలూ చైతే కథలూ దమయంతి వ్యాసాలూ చదివినవాళ్లు ఉండవచ్చు. రేణుక పేరు విన్నవాళ్లూ ఉండవచ్చు. కాని ఆ అనేక నామవాచకాలు వదిలి ఇవాళ ఆమె సర్వనామమయింది. సర్వజనుల నినాదమయింది. వేల గొంతుల ప్రతిధ్వని అయింది. సకల పీడితుల ముద్దుబిడ్డ అయింది.

ఆ గడ్డ మీదనే ఆ వాగు ఒడ్డునే ఎనబై ఏళ్ల కింద దొడ్డి కొమరయ్య మోదుగు పువ్వై వసంతాన్ని పిలిచాడు. ముప్పై ఏళ్ల కింద సంతోష్ రెడ్డి, వెంకటరమణ, రాజు, శ్రీను మంకెన పూలై విప్లవ పరిమళాన్ని వీచారు. ఆ నేలలో ఆ వాగులో ఆ నీటిలో బుడిబుడి అడుగులు వేసిన చిట్టమ్మ తెలుగు నేల అటు చివరి నుంచి ఇటు చివరి దాకా, దండకారణ్యమంతటా తన అక్షరాల ఆచరణల ప్రేమాభిమానాల మల్లెలు చల్లింది.

కొమరయ్యను మరిచానా, సంతోష్‌ను మరిచానా, నాకోసం నెత్తురు ధారపోసిన బిడ్డలలో ఏ ఒక్కరినైనా మరిచానా, నా చిన్నారి పొన్నారి చిట్టమ్మను మరుస్తానా అంటున్నది కడవెండి వాగు. రేణుక ఆశయ మార్గాన్ని ఎన్నటికీ వీడం అంటున్నది అక్కడి ప్రతి ఇసుక రేణువూ, ప్రతి ప్రకృతి శకలమూ, ప్రతి మానవ హృదయమూ...

❖❖❖

# ఆమె దాచిన ప్రేమ

*- రమాసుందరి*

**అ**శేష ప్రజానీకంతో మమేకమైన తాత్వికత ఆమె
చారెడు చెలక కోసం యుద్ధాలు చేస్తున్న ఆదివాసీల ఆకాంక్ష ఆమె
కుల పీడన పోవాలని కళ్ళెర్ర చేస్తున్న దళితుడి పగ ఆమె
స్త్రీలు కోరుకొనే సమానత్వం ఆమె
బద్దలవబోతున్న అడవి ఆమె
ఆమెకు మరణమేమిటి?
ఈ అడవి దాపున ఇప్పపూల చెట్టు నుండి ఆమె ఆకాంక్ష
బయటకు ఎప్పుడో అలుముకొంది
పసిపిల్లల కోసం ఆమె దాచిన ప్రేమ
నేడు భూమ్యాకాశాలను ఆవహించింది !

❖❖❖

# నివాళి!

– ఎంఏ బాసిత్

కడచూపు జూడనైతి కామ్రేడ్...
కళ్ల ముందే కాలి బూడిదైతివి!

ఒక యోధ విశ్రమిస్తే
ప్రభవిస్తురు వేలకొలది!

నీ త్యాగం వృధా కాదు
నీ అక్షరం అజరామరం!

నీ జ్ఞానం తరగనిది
నీ జ్ఞాపకం చెరగనిది!

ఒక చేత సమసమాజ పోరాటమై నడుస్తూ
ఇంకో చేత కొత్త ప్రపంచ కలను లిఖిస్తూ...!

రెండు చేతులా
విప్లవ పోరాటం నిర్వహిస్తూ...!
ఆవిర్భవించిన నేలతల్లి ఋణం తీర్చుకోవడానికి
కడవెండి గర్భంలో... చరిత్ర పుటల్లో...

నిలిచిన కమనీయ పోరాట పాఠమై...
నింగి కెగసిన తారకవ్వడం రమణీయం కదా!

బూడిదలోంచి లేచిన ఫీనిక్స్‌లా
నీ ఆరాటం లేచి నిలుస్తుంది
నీ పోరాటం గెలుస్తుంది!

నీ చితి మంట..
నిన్ను కాల్చుకు తిన్న రాజ్య ఆధిపత్యాన్ని కూలుస్తుంది!

ఈ సమాజ దుర్నీతిని, స్వార్థాన్ని
అసమానతల కుళ్లును కాలుస్తుంది!

కామ్రేడ్! మళ్లీ చెబుతున్న
నీ అమరత్వం
త్యాగశీల పోరాట ప్రతీక మాత్రమే కాదు..
అస్త్రం ఆచంద్రతారార్కం!

విప్లవ కథకులు కామ్రేడ్ మిడ్కో ఏ గుమ్మడవెల్లి రేణుకకు
అరుణారుణ జోహారులు!
అక్షయమై.. అక్షరమై... అజరామరమైన
మిడ్కో స్ఫూర్తికి ఘనమైన నివాళులు!

❖❖❖

# జోహార్లు!

– దేవిశ్రీ

నేల రాలుతున్న తారలను చూసి
ఎండిపోయిన రక్తం మళ్ళీ
ప్రవహిస్తుదేమో...
మురికి పట్టిన ఆలోచనలు మళ్ళీ
విచ్చుకుంటాయేమో
రంగుల ప్రపంచానికి అలవాటు పడిన కళ్ళు
వాస్తవాలను చూడగలుగుతాయేమో
మూగబోయిన గొంతులు
మళ్ళీ మాటలు నేర్చుకుంటాయేమో
చచ్చు బడిన చేయి కరచాలనం కోసం
వెతుకుతుందేమో..
కాలక్షేపం కోసం పీలుస్తున్న ఈ శ్వాస
గుండె నిండా తీసుకొని ఎన్నాళ్ళు అయ్యిందో..
మా దోసిలి నిండా మీ చిరునవ్వులు ఎత్తుకొని
పరిగెత్తగలమో లేదో...
మీ పాట, మాట, బాట ఎన్నడో
చెట్టు, పుట్ట నేర్చుకున్నాయి
అదిగో.. ఆ జోరీగ అప్పుడే గానం చేస్తుంది

మీ త్యాగాలతో పురుడు పోసుకునే సూర్యుడు
లక్షల కాంతి కిరణాలతో ఉదయిస్తున్నాడు
మీ త్యాగాల చరిత్ర ఎన్నటికీ వృధా కాదు
చిటికెన వేలై మమ్మల్ని నడిపిస్తాయి

*(కగార్ తూటాలకు బలి అయిన రేణుక అక్కకు జోహార్లు)*

❖❖❖



# మరణమే లేని మిడ్కో

– మా.ర.రా.

మిడ్కోకు
వీడ్కోలు పలుకాలంటే మనసొప్పట్లేదు
ఇంతకీ ఆమె యాడికెళ్లిందని!
ఇంకా మన మధ్య తిరుగాడుతుందనే
సోయితో మిడ్కోకు వీడ్కోలు సెప్పట్లేదు

రక్తపు మాంసంగా మిగిలిన ఆమె దేహం
ఈ దేశపు ముఖచిత్రంగా వెలుగుతుంది
మిణుగురులను వెంటేస్కోని
చీకటి రాజ్యంపై దండయాత్ర చేస్తుంది
చీకట్లోకి దూసుకు వొస్తూ
కాంతిని పరిచే వెన్నెలవుతుంది

రాజ్యమిప్పుడూ సంబుర పడుతోంది కదా!
కగార్ పేరుతో వేటాడుతూ విప్లవ కారుల ప్రజల ఊపిరి తీస్తుంది
రేణూ మాత్రం యుద్ధంలో విజేతగా అమరురాలైంది
ఆమె అమరత్వం.. ఆ కంటి చూపు.. ఆ చిరునవ్వు..
రాజ్యాన్ని అనునిత్యం భయపెడుతూ ఉంటుంది

ఆమె మలిచిన అక్షరాలు
ప్రశ్నల కొడవళ్ళై మొలిచి పోరుదారులైతయి
ఆ దారెంట పీడిత జనవిముక్తికై
ఆమె ఎత్తి పట్టిన ఆశయ జెండా
నూతన మానవ రూపం!

మిడ్కో, భాను, దమయంతి, చైతే, చిట్టమ్మ
పేరు ఏదైనా రేణక్క రూపమొక్కటే.. శ్వాస ఒక్కటే!

ఆమిప్పుడూ
నింగికెగసిన ధృవతార
మరణం నుంచి విముక్తి పొందిన 'భాను'డు!

❖❖❖



# రేణుక అలియాస్ 'మిడ్కో'

*- ఎస్.ఏ. డేవిడ్*

కొంతమంది చనిపోయినా వారిని చూసి మురిసిపోయే సందర్భాలు చాలా అరుదు. మనల్ని బతికించే ఏదో ఒక ఆశ వాళ్ళు వదిలి వెళ్ళినప్పుడే అది సాధ్యమౌతుంది. అటువంటి అచంచలమైన విశ్వాసాన్ని కామ్రేడ్ రేణుక ఇప్పుడు రాష్ట్రంలోని వందలాది మందికి కలిగించింది. అందుకే ఆమెను ఎన్‌కౌంటర్ పేరిట పోలీసులు హత్యచేశారని తెలియగానే ఒకరకమైన ఉలికిపాటు, ఆందోళన, అదే సమయంలో ఆమె అమరత్వాన్ని కీర్తిస్తూ ఎక్కడిక్కడ స్పందనలు వెల్లువెత్తాయి.

అలా స్పందించిన వాళ్లలో ఎక్కువ మందికి ఆమె ప్రత్యక్షంగా పరిచయం కూడా వుండకపోవచ్చు. కొందరికి ఆమె చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వుంటే, మరికొందరికి అమె రచనలు పరిచయం వుండొచ్చు. అతి కొద్దిమందికే తప్ప రేణుక మిడ్కోగా మారిన పరిణామం తెలియకపోవచ్చు. కానీ అందరిలో ఆమెలేని లోటును ఒకేలా కలిగించే అరుదైన జ్ఞాపకం ఆమె.

బహుశా ఆ జ్ఞాపకమే ఆమె మరణాంతరం అంతమందిని దగ్గరకు చేర్చింది.

ఆమె దహనసంస్కారాలకు వచ్చిన జనాలతో కడివెండి నిండిపోయినప్పుడు ఆ జనాలను చూసి అప్పటికప్పుడు నా ఫేస్‌బుక్ వాలుపై రాస్తూపోయాను దారిపొడవునా జనం / ఇళ్ల ముందూ జనం / అరుగు మీద జనం / మూల మలుపున జనం / మేడమీద జనం బ్రిడ్జీ మీద జనం / ఎటుచూసినా జనమే / ఇది కదా బతుక్కి అర్థం / ఇది కదా అమరత్వం అని.

నిజానికి ఇలాంటి అమరత్వం అందరికీ సాధ్యమయ్యేది కాదు. కొందరే ఆ అమరత్వాన్ని ముద్దాడుతారు. ఆ అమరత్వాన్ని ముద్దాడుతూ కూడా అనే ప్రశ్నల్ని, సవాళ్లను ఎక్కుపెడుతూ, మరి మీ సంగతేంటీ అంటూ నిలదీస్తారు. కామ్రేడ్ రేణుక అదే పని చేసింది.

నిస్తేజంగా పడున్న ఆమె దేహం ఏమీ చేయలేదు అని రాజ్యం అనుకోవచ్చు ఇవాళ. కానీ ఆ నిస్తేజమైన దేహం ఎంతమందికి దారిచూపించిందో ఎవరికి తెలుసూ..!?

ఒకనాడు మౌనంగా కనిపించే రేణుకలో కూడా ఆ ఆనవాళ్లు కనిపించి వుండకపోవచ్చు.

కామ్రేడ్ రేణుక మరణం తర్వాత అమెను కడసారి చూడటానికి వచ్చిన జనాలతో కడివెండి ఎరుపెక్కినప్పుడు ఆ గుంపులోంచి ఒక పెద్దావిడ అంది "అమ్మాయిని చూస్తే ఎప్పుడు అలా అనిపించేది కాదు. ఎంతో సౌమ్యంగా, చాలా ముచ్చటగా, పెద్ద జడతో ఎప్పుడూ నవ్వుతూ కనిపించే రేణమ్మ దళంలోకి వెళు తుందని కానీ, ఇలా తిరిగొస్తుందని కానీ ఎవ్వరం అనుకోలేదు బిడ్డ" అని.

బహుశా ఇదే అభిప్రాయం కనిపెంచిన తల్లిదండ్రులకు, కలిసి చదువుకున్న స్నేహితులకు, తొడబుట్టిన వాళ్లకు కలిగివుండొచ్చు. కానీ వాస్తవ పరిస్థితి అది కాదు కదా?

రేణుక మరణ వార్త తెలిసిననప్పటి నుండి "నా కొడుకు దళంలోకి వెళతా అంటున్నాడని ఓ తండ్రి" చెబుతున్నాడంటే ఆమె అమరత్వం ఎన్ని ప్రశ్నలను ముందుంచవచ్చు. దొడ్డి కొమురయ్యను హత్యచేస్తే ఆగుతుందనుకున్న విప్లవం రేణుకక్క మరణం కూడా ఆపలేకపోతుందంటే ఈ వ్యవస్థ నిర్మాణంలోనే రేణుకలాంటి వాళ్లు పురుడుపోసుకునే అసమానత్వం వుందనే కదా అర్థం. దాన్ని రూపుమాపకుండా వ్యక్తులను హతమారుస్తూపోతూ వుంటే సమస్య జఠిలమవ్వడం తప్ప ఎప్పటికీ సమాధానం దొరకదు.

నిజానికి రేణుక నాకు ఎలా పరిచయం అంటే ఏం చెప్పాలి? మిడ్కో తెలుసు గానీ ఊరందరికీ తెలిసిన రేణుక నాకు తెలియదనే చెప్పాలి..!

'మిడ్కో'. గమ్మత్తుగా అనిపించే ఈ పేరును నేను మొదటి సారి విన్నది 2012లోనే..!

2012లో ఉస్మానియా యూనివర్సిటీలో మేమంతా బీఫ్ ఫెస్టివల్ నిర్వహించినప్పుడు ఓవిధమైన ఘర్షణ వాతావరణం నెలకొంది.

బీజేపీ గోషామాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఒకవైపు, మతోన్మాద ఏబీవీపీ మరో వైపు ఓయూ విద్యార్థులపై కన్నెర్ర చేస్తూ అడ్డుకుంటామని తమ శ్రేణులతో కలిసి కార్యచరణను ప్రకటించినప్పుడు, అప్పటిదాక ప్రోగ్రెసివ్ శక్తులనుకుంటున్న యూనివర్సిటీ ప్రొఫెసర్ల నుండి మాకు ఎటువంటి మద్దతు లభించకపోగా తీవ్ర వ్యతిరేక వ్యక్తం అయింది.

కొంతమంది దళిత ప్రొఫెసర్ల నుండి 'బి వేర్ ఆఫ్ బీఫ్ పాలిటిక్స్', 'తెలంగాణ ఉద్యమాన్ని పక్కదారి పట్టించడానికే వామపక్ష, విప్లవ విద్యార్థి సంఘాల విద్యార్థులు ఈ బీఫ్ ఫెస్టివల్ ను ముందుకు తీసుకొచ్చారు' అని ఆరోపణలు చేస్తున్నప్పుడు మాకు మద్దతుగా నిలిచింది కామ్రేడ్ మిడ్కోనే..!

నాగరిక సమాజం అని చెప్పుకునే దగ్గర, ఎదుటివ్యక్తి ఆహారపు అలవాట్లను అవమానిస్తూ, తింటే నీచంగా చూస్తున్న దగ్గర, అకారణంగా ప్రాణాలు తీస్తున్న నేపథ్యంలో, విప్లవోద్యమం అట్టడుగు కులాల ఆహారపు అలవాట్లను సొంతం చేసుకొని, ఎలా సంరక్షిస్తుందో మాతో పంచుకుంది కామ్రేడ్ మిడ్కో...!

బీఫ్ తినడం పట్ల ఉన్న అనుకూలత పంది మాంసం పట్ల లేని కొన్ని మత సమూహాల విషయంలో కూడా విప్లవోద్యమం ఎలా వ్యవహరించిందో సుదీర్ఘ వ్యాసంలో వివరించింది మిడ్కో.

సంఖ్య పరంగా ముస్లిం సామాజిక నేపథ్యం నుండి విప్లవోద్యమం లోకి వెళ్ళిన వాళ్ళు తక్కువే

అయినప్పటికీ పంది మాంసాన్ని తినడాన్ని అలవాటు చేసుకున్నట్లు వివరిస్తుంది. పైగా అట్టడుగు కులాల ఆహారాన్ని ఎవరైనా తినకపోవడం అంటే చైతన్యంలో ఒకడుగు వెనకబడినట్లే అనే 'కొత్త ఎరుక'ను కలిగించింది మిడ్కో.

'ఈకాలంలో కూడా బీఫ్ తింటారా...ఇంత చదువులు చదువుకొని ఇంకా తిండి గోలేనా' అని మేధావులనబడే యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఎద్దేవ చేస్తున్నపుడు అట్టడుగు కులాల ఆహారాన్ని అలవాటు చేసుకోవడం అంటే, ఆ అట్టడుగు కులాలతో కలిసిపోవడంగా, డి క్లాసిఫై అవ్వడంగా, ఆహారపు అలవాట్లను గౌరవించడం అని ప్రస్తావించింది మిడ్కో.

అప్పటిదాక మిడ్కో అంటే ఎవరో తెలియని నాలాంటి వాళ్లకు తన విప్లవోద్యమ ఆచరణ ద్వారా విషయాలను అర్థం చేస్తున్నప్పుడు తనెవరో మరింత తెలుసుకోవాలనే ఆసక్తిని కలిగించింది.

మూడు దశాబ్దాల క్రితం మాలాగే ఓ యూనివర్సిటీ విద్యార్థిగా ఉన్న ఆమె, పుట్టిన ఊరు, పెరిగిన వాతావరణం, చుట్టూ ఉన్న సమాజం తననో విప్లవ మహిళగా తీర్చిదిద్దితే, ప్రత్యామ్నాయ రాజకీయాల ద్వారా తప్ప ఈ సమాజ మార్పు సాధ్యం కాదని భావించిన ఆమె విప్లవోద్యమమే తన గమ్య స్థానంగా భావించి 'మిడ్కో' గా పరిణామం చెందిందని అర్థమైంది.

ఆ పరిచయమే ఆమె రచనల్ని వెతికి పట్టుకునేలా చేసింది. మూడున్నర దశాబ్దాల తన రచనా జీవితంలో రచయితగా నాలుగు పదులు మించని కథలు రాసినప్పటికీ ఒక్కో కథ చదువుతున్నప్పుడు అందులోని వాక్యాలు చేర్నకోలలా తగులుతాయి.

ఆమె కన్నా గొప్ప సైద్ధాంతిక పరిజ్ఞానం కలిగిన వాళ్లు, సాహసోపేతంగా పనిచేసిన వాళ్ళూ విప్లవోద్యమంలో ఎందరో వుండొచ్చు. కానీ తను చదివిన, తన అనుభవంలోకి వచ్చిన ప్రతి విషయాన్నీ నేరుగా హృదయంలోకి తీసుకుని వ్యక్తీకరించే మనస్తత్వం ఆమెది. అందుకే ఆమె రచనల్లో ఆ సూటిదనం కనిపిస్తుంది.

'సంకెల' కథలో ఓ చోట అంటుంది మిడ్కో " సినిమాలలో ఆడవాళ్ళను ఇంత నీచంగా చూడటానికి అలవాటు పడిన మగవాళ్ళు నిజజీవితంలో మాత్రం వాళ్లను ఎలా గౌరవిస్తారు.." అని.

పదేళ్ళ క్రితం చదివాను ఆ కథను. కానీ ఎప్పుడూ ఏ సినిమా చూస్తున్నా అందులో అసభ్యకరమైన ఏ సన్నివేశం కనిపించినా మిడ్కో రాసిన ఆ కథ గుర్తుకు వచ్చి చురకంటించినట్లు అనిపిస్తుంది.

'ప్రవాహం' కథలో భర్తను, సహచరుడిని అనుసరిస్తూ ఉద్యమంలోకి వెళ్లిన స్త్రీ, తన సహచరుడు లొంగిపోయి ఆమెను తనవెంట రమ్మంటూ "అప్పుడు నన్ను ఇష్టపడ్డావు, నేను చెబితే విన్నావు. ఇప్పుడు వినవేంది" అంటే, "నీకు పార్టీ ఇచ్చిన చైతన్యమే లేకుంటే మంచి భర్తగా వుండేవాడిని కాదు. నేను నిన్ను ఇష్టపడేదాన్నే కాదు. నిన్నింత మంచిగా తయారు చేసింది పార్టీ అని అర్థమయిన తర్వాత పార్టీని ఇంకా ఎక్కువ ఇష్టపడ్డాను, అందుకే వదిలి రాలేను.." అని నిక్కచ్చిగా చెబుతుంది మిడ్కో.

ఇలా ఒక్కటేమిటి తను రాసిన ప్రతి కథలో స్త్రీ వ్యక్తిత్వాన్ని ఉన్నతీకరించే ప్రయత్నాన్ని ఎత్తిపడుతుంది మిడ్కో.

"లల్లీ (లలిత) ఉద్యమంలోకి పోయి కొన్నేళ్ల తర్వాత తను కూడా తిరిగొస్తదా? రాదు! తను చాలా

గట్టిగా నిలబడుతది. ఎందుకంటే తను ఉద్యమావసరాన్ని తన జీవితసారంలోంచి గుర్తించింది...” అని ‘మెట్లమీద’ కథలో లలిత గురించి చెబుతుంది మిడ్కో. నిజానికి ఆ కథలోనీ లలితలో మిడ్కోనీ చూడవచ్చు మనం..

లలితలా మిడ్కో కూడా చివరికంటా వెనుతిరిగి చూడలేదు.

అందుకే సంపూర్ణ విప్లవ జీవితాన్ని జీవించిన ఆమెను చూడటానికి, స్మరించుకోవడానికి తండోప తండాలుగా జనం తరలి వచ్చారు.

ఇవాళ రేణుకక్కను స్మరించుకోవడమంటే విప్లవ నిబద్ధతను, విప్లవ ఆచరణను స్మరించుకోవడమే. విప్లవ రాజకీయాలతో పనిచేసిన అందరూ విప్లవకారులు కాలేదు. విప్లవ ఆచరణలో తమను తాము పూర్తిగాలీనం చేసుకున్న వారు మాత్రమే నిజమైన విప్లవ కారులు కాగలరు. కామ్రేడ్ రేణుక సంపూర్ణ విప్లవకారిణి.

❖❖❖




*రేణుక అంతిమయాత్రలో*

# దంతెవాడ-బీజాపూర్ సరిహద్దులో మార్చి 31న జరిగిన ఎన్‌కౌంటర్ బూటకం!

- రేణుక హత్యపై దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రకటన పూర్తి పాఠం
- కామ్రేడ్ రేణుక అలియాస్ చైతెను అరెస్ట్ చేసిన తర్వాత హత్య చేశారు.
- కార్పొరేట్ దోపిడీని సుగమం చేయడానికే ఈ మారణకాండలు, హత్యలు.
- ఆదివాసుల, విప్లవకారుల మూకుమ్మడి హత్యలను తక్షణం ఆపాలి.

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ రేణుక అలియాస్ భాను అలియాస్ చైతెను దంతెవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దులో, ఇంద్రావతి నది ఒడ్డున మార్చి 31న ఎన్‌కౌంటర్‌లో హతమార్చామని పోలీసులు, ప్రభుత్వ అధికారులు చేసిన ప్రకటన పూర్తిగా అబద్ధం. వాస్తవానికి కామ్రేడ్ చైతె అనారోగ్యం కారణంగా బీజాపూర్ జిల్లా, భైరమ్‌గఢ్ బ్లాక్, బేల్నార్ గ్రామంలోని ఒక ఇంట్లో ఒంటరిగా విశ్రాంతి తీసుకుంటోంది. కచ్చితమైన సమాచారంతో పోలీసులు మార్చి 31 ఉదయం 4 గంటల సమయంలో ఆ ఇంటిని చుట్టుముట్టి కామ్రేడ్ చైతెను అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన చోటనే ఆమెను రెండు-మూడు గంటల పాటు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ నిఘా విభాగాల అధికారులు ఇంటరాగేట్ చేశారు. ఉదయం 9-10 గంటల మధ్య ఆమెను ఇంద్రావతి నదీ తీరానికి తీసుకెళ్లి నిర్దాక్షిణ్యంగా హత్య చేశారు. అక్కడ సాయుధ మావోయిస్టులతో ఎన్‌కౌంటర్ జరిగిందని, ఆ ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ చైతె మరణించిందని, అక్కడ ఒక ఇన్సాస్ రైఫిల్ దొరికిందని చెప్పినవన్నీ అబద్ధాలే. కామ్రేడ్ చైతెను బూటకపు ఎన్‌కౌంటర్ చేశారన్నదే నిజం.

కామ్రేడ్ గుముడవెల్లి రేణుక అలియాస్ చైతె (55) తెలంగాణలోని జనగాం జిల్లా, దేవరుప్పుల మండలం, కడవెండి గ్రామానికి చెందినవారు. తిరుపతిలో ఎల్ఎల్‌బీ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. దాదాపు 35 యేళ్లుగా విప్లవోద్యమానికి సేవలందిస్తూ, ప్రతి మలుపులోనూ ఆమె ఉద్యమాన్ని అంటిపెట్టుకొని ఉన్నారు. అనారోగ్యంతో ఉన్నా చివరి ఊపిరి వరకూ పార్టీ అప్పగించిన బాధ్యతలన్నీ దృఢ సంకల్పంతో, చొరవతో నెరవేర్చారు. మొదటి నుంచి చివరి వరకూ తెలంగాణ, దండకారణ్యాల్లో మహిళా విముక్తి ఉద్యమంలో కీలక, క్రియాశీల పాత్ర

పోషించారు. ఆమె దండకారణ్య మహిళా సబ్‌కమిటీలో క్రియాశీల సభ్యురాలిగా ఉన్నారు. దండకారణ్య స్పెషల్ జోన్ అధికార పత్రిక 'ప్రభాత్', క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంగఠన్ అధికార పత్రిక 'సంఘర్ష్‌రత్ మహిళ', దాని గోండీ వెర్షన్ 'లడెమాయన మహిళ'ను క్రమం తప్పకుండా ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను ఆమె అద్భుతంగా నెరవేర్చారు. అంతకు ముందు ఆమె సీఆర్‌బీ (సెంట్రల్ రీజియనల్ బ్యూరో) రాజకీయ పత్రిక 'క్రాంతి' సంపాదకవర్గంలో కూడా పని చేశారు. దండకారణ్య ఉద్యమానికి అవసరమైన ప్రచార సామగ్రిని తయారు చేయడంలో కూడా ఆమె కాంట్రిబ్యూషన్ ఉంది. పీడిత ప్రజల సమస్యలు, వాటి పరిష్కారం దిశగా ఆమె ఎన్నో వ్యాసాలు, కథలు రాశారు. దండకారణ్య విప్లవోద్యమంలో క్రియాశీల రాజకీయ పాత్ర పోషించిన ఒక ప్రజా నాయకురాలిని, విప్లవ రచయితను, విప్లవ మేధావిని కోల్పోవడం మా ఉద్యమానికి పూడ్చుకోలేని లోటు. కామ్రేడ్ చైతెకు మా ఎస్‌జెడ్‌సీ తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తోంది. ఆమె కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ప్రగాఢ సంతాపం తెలుపుతోంది. ఆమె కలలు గన్న సమసమాజాన్ని నిర్మించేందుకు కట్టుబడి ఉంటామని శపథం చేస్తోంది.

మార్చి 25న కూడా ఇదే విధంగా, నిఘా సమాచారం ఆధారంగా, ఇదే ఇంద్రావతి ప్రాంతంలోని బోడ్గ గ్రామంలో మా సీనియర్ కామ్రేడ్, ఇంద్రావతి ఏరియా కమిటీ సభ్యుడు కామ్రేడ్ లంకేశ్వరపు సారయ్య అలియాస్ సుధీర్ సహా కొందరు గ్రామస్థులను అరెస్ట్ చేశారు. పోలీసు అధికారులు సుధీర్‌ను అక్కడే ఇంటరాగేట్ చేశారు. ఉదయం 10 గంటల సమయంలో సుధీర్‌తో పాటు అరెస్టు చేసిన గ్రామస్థుల్లో ఇద్దరు యువకులను ఊరి బయటకు తీసుకువెళ్లి హత్య చేశారు. అప్పుడు కూడా సాయుధ మావోయిస్టులతో ఎన్‌కౌంటర్ జరిగిందని, అందులో 25 లక్షల రివార్డు గల ఎస్‌జెడ్‌సీ మెంబర్‌ను హతమార్చామని పోలీసు అధికారులు ఒక కట్టుకథను వినిపించారు. వాస్తవానికి కామ్రేడ్ సుధీర్ ఇంద్రావతి ప్రాంతంలో జనతన సర్కార్ టీచరుగా తన బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉన్నారు. ఆయన కూడా అనారోగ్యం కారణంగా స్థానిక కార్యకర్తల మద్దతుతో కొంతకాలంగా అక్కడే వున్నారు.

కామ్రేడ్ సుధీర్‌తో పాటు ప్రస్తుత కగార్ నిర్బంధ క్యాంపెయిన్‌లో భాగంగా 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు అమరులైన సహచరులందరికీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ వినమ్రంగా తలవంచి శ్రద్ధాంజలి ఘటిస్తోంది. విప్లవకారుల త్యాగాలు వృధా పోవు. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టుల కలలు ఎన్నటికీ సాకారం కావు.

దేశంలో అధికారంలో ఉన్న బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టులు పీడిత ప్రజలపైనా, వారి తరఫున పోరాడుతున్న విప్లవకారులపైనా భీకర దమనకాండను, ప్రతిఘాతుక యుద్ధాన్ని కొనసాగిస్తు న్నారు. విప్లవోద్యమాన్ని నిర్మూలించి, దండకారణ్యం సహా ఇతర అడవుల్లో ఉన్న విస్తారమైన ప్రకృతి సంపదలన్నిటినీ దేశ విదేశీ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి, కార్పొరేట్ హిందూ రాజ్యాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో విప్లవకారులను, ఆదివాసులను ఊచకోత కోస్తున్నారు. చట్టవిరుద్ధంగా, అప్రజాస్వామికంగా, అమానవీయంగా శవాలను లెక్కించే పనిలో ఉ న్నారు. అడవుల్లోని ఆదివాసీ గ్రామాల్లోంచి ఎన్ని ఎక్కువ శవాలుతెస్తే అంత పెద్ద విజయంగా చెప్పుకుంటున్నారు. ఇవన్నీ చేస్తున్నది గద్దె మీద కూర్చున్న బడా నేతలూ, ఉన్నతాధికారులే. 'సరెండర్ కండి, లేదంటే చంపి పడేస్తాం' అంటూ బాహాటంగానే బెదిరిస్తున్నారు. వీరిలా అంటున్నది, చేస్తున్నది ఏ రాజ్యాంగం కిందికి, ఏ చట్టం కిందికి వస్తుంది?

ఈ నిర్బంధకాండకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక, ప్రగతిశీల, లౌకిక, విప్లవకర సామాజిక సంస్థలు, సెక్షన్లు, వ్యక్తులు గొంతెత్తాలి. ఈ ఎన్‌కౌంటర్లు సహా జరిగిన ఘటనలన్నింటిపైనా న్యాయవిచారణ కోసం పోరాడాలి. ఘటనాస్థలాల్లో పర్యటించి, వాస్తవాలేంటో ప్రపంచానికి చెప్పాలని మేం ఈ సంస్థలను, మీడియా వాళ్లను కోరుతున్నాం.

ప్రభుత్వ కుట్రను అర్థం చేసుకోవాలని, దాన్ని బహిర్గతం చేయాలని మేం దేశంలోని ప్రజ లందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. ఆదివాసుల, విప్లవకారుల ఊచకోతను ఆపాలంటూ గొంతు విప్పాలని కోరుతున్నాం.

**– *వికల్ప్, అధికార ప్రతినిధి***

❖❖❖



*చివరిచూపు...*












ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే
సుధీర్ & రేణుక (మిడ్కో) ఎన్‌కౌంటర్లు బూటకం
ఆపరేషన్ కగార్‌ను
వెంటనే నిలిపివేయాలి
పౌరహక్కుల సంఘం - తెలంగా



